మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



క్రీడాకారులకు స్పైక్ షూస్ అందజేస్తున్న జిల్లా ఎస్పీ

### క్రీడలతో క్రమశిక్షణ

# ఆత్మవిశ్వాసం

**అథ్లెటిక్స్‌లో రాష్ట్ర స్థాయికి**

**ఎంపికైన క్రీడాకారులకు స్పైక్ షూస్ అందజేసిన జిల్లా ఎస్పీ**

**రాష్ట్రస్థాయిలో రాణించి**

**పోలీసు శాఖకు గౌరవం తీసుకురావాలి**

**వనపర్తి, జనవరి 22 ప్రభాతవార్త:** క్రీడలు క్రమశిక్షణను, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయి. పోలీస్ విధులతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపడం గర్వకారణమని జిల్లాఎస్పీ సునితరెడ్డి అన్నారు. ఫిబ్రవరి 2వ తేదీ నుంచి జరగనున్న తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీసు స్పోర్ట్స్, గేమ్స్ మీట్‌కు అథ్లెటిక్స్ (రన్నింగ్) విభాగంలో ఎంపికైన కానిస్టేబుళ్లకు గురువారం వనపర్తి జిల్లా పోలీసుకార్యాలయంలో జిల్లాఎస్పీ స్పైక్ షూస్ అందజేసి ప్రత్యేకప్రోత్సాహం అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ క్రీడాకారులను అభినందిస్తూ రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబర్చి పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనడం ప్రతి క్రీడాకారుడికి లభించే అరుదైన, గౌరవప్రదమైన అవకాశం అని తెలిపారు. అంకితభావం, నిరంతర సాధన, పట్టుదలతో పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభను ప్రదర్శించి విజయాన్ని సాధించాలని క్రీడాకారులకు సూచించారు.
మీ విజయం ద్వారా జోగులాంబ జోన్‌కు, వనపర్తి జిల్లాకు రాష్ట్రస్థాయిలో మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. మీ కృషి, విజయాలు ఇతర పోలీసు సిబ్బందికి ప్రేరణగా నిలిచి, క్రీడల పట్ల ఆసక్తిని మరింత పెంచుతాయని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ, వీరారెడ్డి, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, అప్పలనాయుడు, శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



పట్టణ శివారులో గల లే అవుట్ పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

### నిబంధనల ప్రకారం

# ప్రభుత్వ లే అవుట్లు

**జోగులాంబ గద్వాల కలెక్టర్ బి.యం.సంతోష్**

**గద్వాల జనవరి 22, ప్రభాతవార్త:** లేఅవుట్ల అభివృద్ధి ప్రభుత్వ నిబంధనలమేరకు జరుగేలా తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం గద్వాల్ మున్సిపల్ పరిధిలోని వెంకంపేట శివారులోని సర్వే నంబర్ 20లో లేఅవుట్‌ను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ లే అవుట్‌కు సంబంధించిన మ్యాపులను పరిశీలించి, రోడ్డు కనెక్టివిటీ, నీటి వనరులు, బఫర్ జోన్ తదితర అంశాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.
లే అవుట్ల అభివృద్ధిలో నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, ల్యాండ్ డెవలప్‌మెంట్ ప్రణాళికకు అనుగుణంగా మౌలిక వసతులు సమకూర్చాలని సూచించారు. అంతర్గత రహదారులు, నీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థలను నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేయాలని సూచించారు. బఫర్ జోన్ నిబంధనలను కచ్చితంగా అమలుచేయాలని ఆదేశించారు. అనంతరం గద్వాల్ మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 494 లేఅవుట్‌ను పరిశీలించిన కలెక్టర్, లే అవుట్‌లో నీటి కనెక్షన్, స్ట్రామ్ వాటర్ డ్రెయినేజ్ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. తదనంతరం గద్వాల్ మున్సిపాలిటీ పరిధిలోని పరిమాల శివారులోని సర్వే నంబర్ 1028 లో లేఅవుట్‌ను పరిశీలించిన కలెక్టర్, నీటి వనరులు, విద్యుత్, డ్రెయినేజ్ కనెక్షన్లు సమగ్రంగా అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఓపెన్ స్పేస్‌లను పచ్చదనంతో అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జానకిరామ్, టౌన్ ప్లానింగ్ అధికారి కుర్మన్న, తహసీల్దార్ మల్లికార్జున్, ఎ.ఈలు, తదితరులు పాల్గొన్నారు.




అలంపూర్ మున్సిపల్ కార్యాలయం

### ప్రభుత్వాలు మారుతున్న

# అభివృద్ధిలో నిర్లక్ష్యం

**అభివృద్ధివైపు అడుగులు వేసే పాలకమండలి రావాలి**

**పేరుకే మున్సిపాలిటీ పేరు గొప్ప ఊరు దిబ్బ**

**పాలించిన పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధి శూన్యం**

**అభివృద్ధి చేసే నాయకులనే ప్రజలు ఎన్నుకోవాలి**

**మున్సిపాలిటీ ఎన్నికలలో నిలబడే నాయకులకు గుణపాఠం కావాలి**

**అలంపూర్ జనవరి 22, ప్రభాతవార్త :** మున్సిపాలిటీ పట్టణ ప్రాంతాల్లో అభివృద్ధి వైపు అడుగులు వేసే పాలకమండలి రావాలని రాజకీయ విశ్లేషకులు, ప్రజలు కోరుకుంటున్నారు. గద్వాల –మిగతా4లో..

## కాంగ్రెస్ కక్ష సాధింపు

**ప్రజల దృష్టి మరల్చడానికే కెటిఆర్‌కి**

**సిట్ నోటీసులు : మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి**

**మహబూబ్‌నగర్, జనవరి 22 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ రాజకీయ కక్ష్య సాధింపు చేస్తుందని, ప్రజల దృష్టి మరల్చడానికే కేటీఆర్‌కు సిట్ నోటీసులు అందజేసిందని బిఆర్ఎస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి అన్నారు. మంత్రుల వాటా పంచాయతీ మీద ప్రజల దృష్టి మరల్చడానికే నోటీసులు ఇస్తుందని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల వేళ బీఆర్ఎస్‌ను ఇబ్బంది పెట్టడానికే సిట్ నోటీసులు అంటూ ప్రజల దృష్టిని మరల్చే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. బొగ్గు స్కాంలో సమాధానం చెప్పలేక ప్రభుత్వం ఇదంతా చేస్తుందని, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కి సంబంధం లేని అంశంలో ఇరికించాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. కేటీఆర్ వెంట తెలంగాణ సమాజం అంతా ఉందని, ఎక్కడికి వెళ్లినా వచ్చేది మళ్లీ బిఆర్ఎస్ ప్రభుత్వమే అని ప్రజలు చెబుతున్నారని పేర్కొన్నారు. మీ కేసులకు, నోటీసులకు భయపడేది లేదని, బిఆర్ఎస్ ఉద్యమ పార్టీ అని తమకు కేసులు కొత్తేమీ కాదన్నారు. అక్రమ కేసులను బీఆర్ఎస్ అన్ని రకాలుగా ఎదుర్కొంటుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులది అంతా డైవర్షన్ పాలిటిక్స్ అని, అన్ని అబద్ధాలు, తొండి రాజకీయం చేయడం వాళ్లకు వెన్నతో పెట్టిన విద్య అని పేర్కొన్నారు.




### ఆ ఐదు పాఠశాలలకు

# అనుమతి లేదు..

- **మహబూబ్‌నగర్‌లో ఇష్టారీతిగా పాఠశాలల నిర్వహణ**
- **మూసివేయాల్సిందే డీఈవో ఆదేశం**
- **నవంబర్ నెలలోనే జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్డర్**
- **అమలు చేయని మహబూబ్‌నగర్ ఎంఈఓ**
- **నేటికీ చర్యలు శూన్యం**
- **విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం..?**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 21 ప్రభాత వార్త:** విద్యను అంగడిలో సరుకుగా మారుస్తూ కొన్ని యాజమాన్యాలు ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నాయి. ఇష్టారీతిగా పాఠశాలల నిర్వహణ కొనసాగిస్తున్నాయి. పాఠశాలల నిర్వహణకు అనుమతి లేకుండానే దర్జాగా నడిపిస్తున్నాయి. అయితే ఇందుకు కొందరు విద్యాశాఖ అధికారులు అండగా ఉండడం గమనార్హం. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో 2025 26 విద్యా సంవత్సరానికి సంబంధించి కొత్తగా పదుల సంఖ్యలో పాఠశాలలు వెలిశాయి. అయితే అందులో కొన్ని పాఠశాలలకు అనుమతి లేకుండానే ఇంతవరకు నడిపిస్తూ వచ్చారు. యాజమాన్యాలకు విద్యాశాఖ అధికారులతో ఉన్న సత్సంబంధాల కారణంగానే అనుమతి లేకుండా పాఠశాల నిర్వహణ యదేచ్ఛగా చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా అదే పాఠశాలలో వందల సంఖ్యలో చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తు నేడు ప్రశ్నార్థకంగా మారనున్నది.

**నవంబర్‌లో డిఈఓ ఆర్డర్..**

గత ఏడాది నవంబర్ 15వ తారీఖున మహబూబ్‌నగర్ జిల్లా విద్యాశాఖ అధికారి పేరు మీద మండల విద్యాశాఖ అధికారికి, వారితో పాటు అనుమతులు లేని పాఠశాలలకు కూడా కాపీని పంపించారు. ఆర్డర్ కాపీలో అనుమతి లేని పాఠశాలలను మూసివేయాలి అని ఈ విద్యా సంవత్సరానికి నడిపించకూడదు అని, ఇప్పటికే జాయిన్ చేసుకున్న విద్యార్థులను అందుబాటులోని పాఠశాలలలో అడ్జస్ట్ చేయాలి అని అందులో క్లియర్ గా పొందుపరిచారు. అయితే మండల విద్యాశాఖ అధికారి తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తూ పాఠశాలల పై చర్యలు తీసుకోవడానికి వెనకాడడం గమనార్హం. కనీసం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అయినా పాఠశాలలపై చర్యలు తీసుకోవాల్సిన మండల విద్యాధికారి పట్టించుకోవడం వెనుక ఉన్న కారణం ఏంటి అని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

**ప్రశ్నార్థకంగా విద్యార్థుల భవిష్యత్తు..?**

మహబూబ్‌నగర్‌లో అనుమతి లేని పాఠశాలలలో వందలాదిగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. పర్మనెంట్ ఎన్రోల్‌మెంట్ నంబర్ (PEN) లేదా APAAR ID అనేది ప్రతి విద్యార్థికి ప్రభుత్వం జారీ చేసే ఒక ప్రత్యేక 12అంకెల గుర్తింపు సంఖ్య, ఇది విద్యార్థుల విద్యా వివరాలు, సర్టిఫికెట్లు, మార్కులను డిజిటల్‌గా ఒకే చోట ఉంచడానికి సహాయపడుతుంది, దీనిని అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ (ABC) వంటి వాటితో అనుసంధానం చేసి, విద్యా సంస్థల మధ్య బదిలీ, ఉద్యోగాలకు, లోన్‌లకు ఉపయోగపడుతుంది. అయితే ప్రస్తుతం ఈ అకాడమిక్ సంవత్సరానికి సంబంధించి పాఠశాలలకు అనుమతి ఇవ్వకపోవడంతో విద్యార్థుల వివరాలు ఆన్లైన్లో నమోదు ఎలా చేస్తారు అనేది ప్రశ్నార్థకంగా మారింది. అయితే ఇందులో కొన్ని పాఠశాలలకు ఇతర బ్రాంచెస్ ఉండడంతో ఇప్పటికే అనుమతి పొందిన బ్రాంచీల నుంచి విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నట్టు ఎన్రోల్ చేస్తున్నట్లు సమాచారం.

**అనుమతి లేని పాఠశాలలు ఇవే..**

1. గీతం గ్లోబల్ స్కూల్ (ఈఎం)
2. ఐఏఎఫ్ క్రియేటివ్ స్కూల్
3. సంస్కృతి విద్యాలయ (ఈ.ఎం),
4. షమ్ రాక్ స్కూల్
5. లొండా రాక్ స్కూల్




డిఇఓ ఆర్డర్ జారీ చేసినా ఎంఈఓ చర్యలు తీసుకోకపోవడం వెనక మతలబు ఏంటి అని పలు విద్యార్థి సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. అయితే ఇదే విషయమై డీఈవో ప్రవీణ్ కుమార్‌ను వివరణ కోరగా తాను సదరు పాఠశాలలను మూసివేయాలని ఎంఈఓ కు సైతం ఆర్డర్ జారీ చేసినట్లు తెలిపారు. ఇదే విషయమై ఎంఈఓ లక్ష్మణ్ నాయక్‌ను ఫోన్లో వివరణ కోరగా తాను పాఠశాలలో మూసివేయాలని ఆదేశించినప్పటికీ యాజమాన్యాలు వినడం లేదని చెప్పడం గమనార్హం.



సహాయక సంఘాలకు రుణాల చెక్కును అందజేస్తున్న దృశ్యం

### మహిళల స్వయం

# సమృద్ధియే లక్ష్యం!

**మహిళలను కోటీశ్వరులను**

**చేయడమే ప్రజా ప్రభుత్వం విధానం**

**వడ్డీ లేని రుణాలతో మహిళల ఆర్థిక స్వావలంబనకు**

**బాటలు : మంత్రి జూపల్లి కృష్ణారావు**

**కొల్లాపూర్, జనవరి 22 ప్రభాతవార్త :** కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ సంకల్పమని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. గురువారం కొల్లాపూర్ పట్టణంలోని రాజగారి కోట ప్రాంగణంలో నిర్వహించిన సభలో నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్‌తో కలిసి మెప్మా పరిధిలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రభుత్వం మంజూరు చేసిన వడ్డీ లేని రుణాలను మంత్రి జూపల్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పట్టణ పరిధిలోని 153 స్వయం సహాయక మహిళా సంఘాలకు రూ.47.15 లక్షల విలువైన జంబో చెక్‌ను అందజేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం తరఫున 10వేలమంది మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళల ఆత్మగౌరవం, ఆర్థిక స్వావలంబన పెంపొందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో మహిళల సంక్షేమానికి తొలి సంతకంగా మహాలక్ష్మి పథకం అమలు చేసి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని గుర్తు చేశారు. మహిళాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, గ్రామాలు, పట్టణాల్లో మహిళలు దుబారా ఖర్చులను తగ్గించుకొని పొదుపు, పెట్టుబడుల వైపు దృష్టి సారించాలని సూచించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి విద్యాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశ్యంతో అన్ని రకాల సంక్షేమ, అభివృద్ధి పథకాలను మహిళల పేరుపై అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, సన్నబియ్యం, మహాలక్ష్మి పథకం, సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు, మహిళలకు వడ్డీ లేని రుణాలు, అద్దె బస్సులు వంటి పథకాలు మహిళల ఆర్థిక ఎదుగుదలకు –మిగతా4లో..




జెసిబిను స్వాధీనం చేసుకున్న పోలీసులు

### నదిలోకే హిటాచీలు..!

# ఇసుకను తోడేస్తున్నారు..

**అక్రమార్కులకు పోలీస్ రెవెన్యూ అండదండ..? పట్టపగలే దర్జాగా రవాణా**

**కృష్ణ, జనవరి 22 ప్రభాతవార్త :** కృష్ణ నదిని కొల్లగొడుతున్నారు. అక్రమ ఇసుక రవాణా చేస్తూ అందిన కాడికి దండుకుంటున్నారు. ఇసుక అక్రమార్కులకు అండదండగా రెవెన్యూ పోలీస్‌శాఖ అధికారులు ఉన్నారని బాహాటంగానే చర్చించుకుంటున్నారు. ఏకంగా నదిలోకే హిటాచిలను పంపి టిప్పర్ల ద్వారా ఇసుకను తోడైస్తున్నా అధికార యంత్రాంగం పట్టనట్టు వ్యవహరించడం గమనార్హం. నారాయణపేట జిల్లా అక్రమ ఇసుక రవాణా జోరుగా సాగుతున్నది. గత నాలుగు రోజులుగా దర్జాగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న తమకేమీ పట్టనట్టు వ్యవహరించారు. పదుల సంఖ్యలో టిప్పర్ల ద్వారా ఇసుకను రవాణా చేసినా పట్టించుకోలేదు. మండలంలోని థైరోడ్ ఓంకార మఠం వద్ద గత నాలుగు రోజులుగా అక్రమ ఇసుక రవాణా కొనసాగుతున్నట్లు తెలిసింది. దీంతోపాటు ముడుమాల్ వద్ద కూడా మరో రీచ్ వద్ద ఇసుకను అక్రమంగా రవాణా సొమ్ము చేసుకుంటున్నారు. ప్రధానంగా అధికార పార్టీకి చెందిన ఇద్దరు నాయకులే ఈ తతంగం నడిపిస్తున్నట్లు సమాచారం. దీనికి తోడు అక్రమ రవాణా కు అధికారుల అండదండలు సైతం పుష్కలంగా ఉన్నట్లు –మిగతా4లో..

# మున్సిపల్ ఎన్నికలకు సన్నద్ధం

**ఓటింగ్ జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితా ప్రచురణ**

**జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి**

**అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ విసి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 22 ప్రభాతవార్త:** జిల్లాలోని మహబూబ్ నగర్ నగరపాలక సంస్థ, భూత్పూర్, దేవరకద్ర మున్సిపాలిటీ లలో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. మున్సిపల్ ఎన్నికలకు త్వరలో షెడ్యూల్ విడుదల కానున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణీ కుముదిని గురువారం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా మహబూబ్ నగర్, గద్వాల, వనపర్తి, నాగరకర్నూలు, నారాయణ పేట జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలుగా సన్నద్ధం అయి ఉన్నామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు తెలిపారు. ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితా మ్యాపింగ్ చేసి ప్రచురించడం జరిగిందని తెలిపారు. వీటి వివరాలను ఇప్పటికే టీ.పోల్‌లో నమోదు చేయడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు ఒక రౌండ్ పరిశీలించినట్లు తెలిపారు. ఆర్ఓఏ ఆర్ఓలను గుర్తించడం జరిగిందని తెలిపారు. పోలింగ్ నిర్వహణకు సరిపడా సిబ్బంది అందుబాటులో ఉన్నారని తెలిపారు. బ్యాలెట్ బాక్స్‌లు సిద్ధంగా ఉన్నట్లు, పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ చేయనున్నట్లు తెలిపారు. కౌంటింగ్ నిర్వహణకు పాలమూరు యూనివర్సిటీలో భవనాలను పరిశీలించినట్లు తెలిపారు. జోనల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్.ఎస్.టి బృందాల కు మెజిస్టీరియల్ అధికారాలు కల్పించేందుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. కాగా ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా ఎన్నికలను సాఫీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణీ కుముదిని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, నోడల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్ లు తదితరులు పాల్గొన్నారు.



వీసీలో మాట్లాడుతున్న ఎన్నికల కమిషనర్

**ఎన్నికల సన్నద్ధతపై సమీక్షలో కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి, జనవరి 22 ప్రభాతవార్త :** త్వరలో జరుగబోయే మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు సిద్ధం చేసుకున్నట్లు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. గురువారం నిర్వహించిన సమీక్షలో ఫోటోతో కూడిన ఎలక్టరల్ రోల్ పబ్లిష్ చేయడం, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, కౌంటింగ్ సెంటర్, రిటర్నింగ్ అధికారులు ఎంపిక, పోలింగ్ సిబ్బంది, తదితర అంశాలపై కలెక్టర్లతో సమీక్ష నిర్వహించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బ్యాలెట్ పేపర్ ముద్రణ విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకొని పకడ్బందీగా ముద్రణ జరిగే విధంగా చూడాలని సూచించారు. నామినేషన్ సమయంలో వెబ్ క్యాస్టింగ్ లేదా వీడియో కవరేజీ చేయించాల్సిందిగా సూచించారు. కౌంటింగ్ కొరకు పకడ్బందీగా ముందస్తు ప్రణాళికలు చేసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో జరగబోయే ఐదు మున్సిపాలిటీల ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే ఫోటోతో కూడిన ఎలక్ట్రోల్ రోల్ విడుదల చేయడం జరిగిందని, ప్రజల నుండి వచ్చిన దాదాపు 200 అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరించినట్లు తెలిపారు. జిల్లాలోని 5 మున్సిపాలిటీల్లో 80 వార్డులకు గాను 117441 ఓటర్లకు సరిపడా 191 పోలింగ్ కేంద్రాలను గుర్తించి మున్సిపల్ అధికారులు పరిశీలించి వాటిలో మౌలిక వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రేపు రిటర్నింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని, పోలింగ్ సిబ్బంది వివరాలు ఇప్పటికే టి పోల్ లో నమోదు చేసినట్లు తెలియజేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ చేయించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇప్పటికే పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ సెంటర్లను గుర్తించి తగిన ఏర్పాట్లకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. వనపర్తి జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు వచ్చిన పకడ్బందీగా ప్రశాంతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, డిపిఒ రఘునాథ్, మున్సిపల్ కమిషనర్లు తదితరులు విసిలో పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ విజయేంద్ర బోయి




విసీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మున్సిపల్ కమిషనర్లు అధికారులు

## సీఎం కప్పు క్రీడలను ప్రారంభించిన సర్పంచ్

**మల్దకల్ జనవరి 22, ప్రభాతవార్త:** మండలం ఎల్కూర్ గ్రామంలో గ్రామ స్థాయి సీఎం కప్పు క్రీడలను గ్రామంలోని నేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపా ధ్యాయులు రమేష్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్, ఉపస ర్పంచ్, ఈ క్రీడలు ప్రారంభిస్తూ మాట్లాడుతూ.. గ్రామ సర్పంచ్ పి. వినోద్ కుమార్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు గ్రామాలలో మంచి నైపుణ్యం కలిగిన క్రీడాకారుల ప్రతిభ గ్రామం వరకే పరిమితం కాకుండా వారి ప్రతిభని గుర్తించి మండలం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆడే గొప్ప అవకాశం కల్పించిన సిఎం రేవంత్ రెడ్డి కి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే విద్యార్థులకు ఈ అవకాశం గొప్ప సువర్ణ అవకాశాన్ని ఉపయోగించుకొని గ్రామం నుండి రాష్ట్ర స్థాయి ఆడి గ్రామానికి మంచి పేరు తీసుకొని రావాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమం లో గ్రామ వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యువ నాయకులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యానీయులు పాల్గొన్నారు.


సీఎం కప్పు క్రీడల్ని ప్రారంభించిన సర్పంచ్

## రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

### మండల వ్యవసాయ అధికారి కొర్ర రమేష్

**ఉప్పునుంతల, జనవరి 22 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ వ్యవసాయ శాఖ సంయుక్తంగా రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు మంజూరు చేసినట్టు మండల వ్యవసాయ అధికారి కొర్ర రమేష్ తెలిపారు. రైతుల సాగు ఖర్చులు తగ్గించి దిగుబడులు పెంచే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకంలో రోటవేటర్లు, పవర్ స్ప్రేయర్స్ సబ్సిడీపై మంజూరు అయ్యాయని వివరించారు. ఎస్సీ, ఎస్టీ మహిళ రైతులు సన్న , చిన్న కారు రైతులకు 50 సబ్సిడీ, ఇతర రైతులకు 40 శాతం సబ్సిడీ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ముఖ్యంగా రైతులకు ప్రభుత్వం ప్రకటించిన ట్రాక్టర్ ఆర్సి తప్పనిసరిగా వ్యవసాయ శాఖ పరిధిలో ఉపయోగపడాలి. రైతు పేరు మీద కనీసం ఎకరా భూమి తప్పనిసరిగా ఉండాలని, అవసరమైన పత్రాలుః భూమి పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, ట్రాక్టర్ ఆర్సి, వ్యవసాయ శాఖ సంబంధించిన పరిధిలో బ్యాంక్ ఖాతా వివరాలు ఉండాలని పేర్కొన్నారు. దరఖాస్తులు ఆహ్వానం ఈ పథకం కింద లబ్ధి పొందే అర్హులైన రైతుల నుంచి రైతులు తమ తమ గ్రామాల వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి కొర్ర రమేష్ వివరించారు.

## పేరూరు జడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాలకు 75 ఏళ్లు

### ఈ నెల 25న మూడవ ఆర్గనైజింగ్ కమిటీ సమావేశం

**దేవరకద్ర, జనవరి 22 ప్రభాతవార్త :** కౌకుంట్ల మండలం పేరూరు గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల 1950 జూన్‌లో స్థాపితమై 2026 ఏప్రిల్ నాటికి 75 ఏళ్ల సుదీర్ఘ విద్యా ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి సన్నాహాలు ఊపందుకున్నాయి. నాటి నుంచి నేటి వరకు వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దిన ఈ పాఠశాల ఘన చరిత్రను స్మరించుకుంటూ, పూర్వ విద్యార్థుల సహకారంతో త్వరలో భారీ స్థాయిలో సమ్మేళనం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో సమ్మేళన ఏర్పాట్లపై చర్చించేందుకు మూడవ ఆర్గనైజింగ్ కమిటీ సమావేశం ఈ నెల 25 వ తేదీన ఆదివారం ఉదయం 10 గంటలకు పాఠశాల ఆవరణలో జరగనుంది. సమ్మేళన కార్యాచరణ, ఆర్థిక వనరుల సమీకరణ, పూర్వ విద్యార్థుల భాగస్వామ్యం తదితర కీలక అంశాలపై కమిటీ సభ్యులు ఈ సమావేశంలో నిర్ణయాలు తీసుకోనున్నారు. 75 ఏళ్ల విద్యా సేవలకు గుర్తుగా ఈ సమ్మేళనం పాఠశాల చరిత్రలో మరో మైలురాయిగా నిలవనుందని నిర్వాహకులు తెలిపారు.


జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

## శ్రీ కురుమూర్తి స్వామి హుండీ లెక్కింపు

### రూ.14.40 లక్షల ఆదాయం

**చిన్న చింతకుంట, జనవరి 22 ప్రభాతవార్త :** పల్లె ప్రజల ఆరాధ్య దైవంగా, తిరుమల తిరుపతి వెంకటేశ్వరుడిగా కొలువబడుతున్న శ్రీ కురుమూర్తి స్వామి హుండీ లెక్కింపు గురువారం నిర్వహించారు. పల్లె ప్రాంతాల నుంచే కాకుండా జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తజనం స్వామి వారిని దర్శించుకున్న అనంతరం కానుకల రూపేనా స్వామివారి హుండీలో వేసిన నగదును ఆలయ ఈవో మదనేశ్వర్ రెడ్డి, దేవదాయ శాఖ పరిశీలకులు శ్రీనివాస్ సమక్షంలో లెక్కించగా 14 లక్షల 40వేల 520 రూపాయల ఆదాయం రావడం జరిగిందని వారు తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో మాజీ దేవస్థానం చైర్మన్ గౌని గోవర్ధన్ రెడ్డి, మాజీ పాలకమండలి సభ్యులు భాస్కరాచారి, కమలాకర్, నాగరాజు, గోపాల్, భారతమ్మ, చక్రవర్ధన్ రెడ్డి, ఆలయ అర్చకులు వెంకటయ్య, సత్యనారాయణ, అనంత విజయ్, లక్ష్మీనరసింహచార్యులు, భక్తుడు వెంకటేశ్వర రెడ్డి, సేవా సమితి మహిళా భక్తులు తదితరులు ఉన్నారు.


శ్రీ కురుమూర్తి స్వామి హుండీ లెక్కింపు చేస్తున్న దృశ్యం

## ఉపాధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### గ్రామ సర్పంచ్ మునావత్ మంగమ్మ

**ఉప్పునుంతల,జనవరి 22 ప్రభాతవార్త :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న ఉపాధి హామీ పనులు సద్వినియోగ పరుచుకోవాలని గ్రామ సర్పంచ్ మునావత్ మంగమ్మ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని దేవదారి కుంట తండాలో నర్సరీ ఫిల్లింగ్ పనులను పరిశీలించారు. గ్రామీణ ఉపాధి పథకాలను పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణతో గ్రామాభివృద్ధి లక్ష్యంతో పనులు నిర్వహించాలని ఆమె కోరారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించాలని, జాబు కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి స్థానికంగా ఉపాధి కల్పించి వారి అభివృద్ధికి తోడ్పాటు అందించాలని అమె కోరారు. గ్రామంలో అవసరమైన మొక్కలను స్థానికంగా పెంచే ఉద్దేశంతో నర్సరీలో పీల్లింగ్ కార్యక్రమం విజయవంతంగా సాగేందుకు కృషి చేయాలని సర్పంచ్ కోరారు. సర్పంచ్ మునవత్ మంగమ్మ, పంచాయతీ కార్యదర్శి చందర్ లాల్, ఫీల్డ్ అసిస్టెంట్ మల్లయ్య, తండ వాసులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.


దేవదారి కుంట తండాలో నర్సరీలో ఫిల్లింగ్ పనుల దృశ్యం

## 25 నుంచి వెల్టూర్‌లో బ్రహ్మోత్సవాలు

**ఉప్పునుంతల, జనవరి 22 ప్రభాతవార్త :** మండలంలోని వెల్టూరు గ్రామంలో ఈనెల 25 నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు శ్రీ వెంకటేశ్వర దేవస్థాన కమిటీ చైర్మన్ కూ చకుళ్ళ పద్మనాభ రెడ్డి తెలిపారు. శ్రీ అలి వేలు మంగ సమేత శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గ్రామ సర్పంచ్ చింతోజు వెంకటేష్ సహకారంతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 25న ఆదివారం ఉదయం 5.30 గంటలకు ధ్వజారోహణం, ఉదయం 8 గంటలకు పూర్ణాభిషేకం, ఉదయం 10 గంటలకు శేష వాహన సేవ, ఉదయం 11.30 నిమిషాలకు సూర్య వాహన సేవ, మధ్యాహ్నం 12.30 అశ్వ వాహన సేవ, రాత్రి 7.00 గంటలకు స్వామి వారి పూజ, రాత్రి 8 గంటలకు శ్రీవారి కళ్యాణ మహోత్సవం, రాత్రి 10 గంటలకు భక్త బృందం చే భజన కార్యక్రమం ఉంటుందని చైర్మన్ వివరించారు. 26 సోమవారం వేకువజామున ఉదయం 5 గంటలకు రథోత్సవం, రాత్రి 8 గంటలకు కుంకుమార్చన, రాత్రి 9.30 గంటలకు ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పద్మనాభ రెడ్డి వివరించారు. ఈ బ్రహ్మోత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.


వెంకటేశ్వర స్వామి ఆలయం


వెంకటేశ్వర స్వామి వారు

# జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

### -జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 22 ప్రభాతవార్త:** నాగర్ కర్నూల్ జిల్లాలోని నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్ మున్సిపాలిటీల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికలకు త్వరలో షెడ్యూల్ విడుదల కానున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణీ కుముదిని గురువారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ, 3 మున్సిపాలిటీల పరిధిలో 65 వాటిలో ఎన్నికలు నిర్వహించేందుకు 131 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన 158 బ్యాలెట్ బాక్స్‌లతో పాటు అదనంగా 20 బ్యాలెట్ బాక్స్‌లు సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఎన్నికల బ్యాలెట్ పేపర్ ప్రింటింగ్ కొరకు మహబూబ్ నగర్‌లో గుర్తించడం జరిగిందని, సిబ్బందికి శిక్షణ తరగతులను నిర్వహించడం జరిగిందన్నారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలుగా సన్నద్ధమై ఉన్నామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ దృష్టికి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెచ్చారు. జిల్లాలోని 3 మున్సిపాలిటీల పరిధిలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. వీటి వివరాలను ఇప్పటికే టీ.పోల్‌లో నమోదు చేయడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాల విషయమై వచ్చిన అభ్యంతరాలను నిశితంగా పరిశీలిస్తూ పరిష్కరించడం జరిగిందన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమిస్తూ, వారికి శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. బ్యాలెట్ బాక్సులు, ఇతర సామాగ్రి అందుబాటులో ఉందని, షెడ్యూల్ విడుదలైన వెంటనే ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా నిఘాను ఉంచేందుకు వీలుగా ఎస్.ఎస్.టీ, ఎఫ్.ఎస్.టీ బృందాలను నియమిస్తున్నామన్నారు. ఓటు చైతన్యం కోసం సోషల్ మీడియాలో కూడా విస్తృతంగా ప్రచారం చేయాలని తెలియజేశారు. బ్యాలెట్ బాక్సులు, సామాగ్రి, బ్యాలెట్ పేపర్ల ప్రింటింగ్ కు అవసరమైన ఏర్పాట్లు, నామినేషన్ స్వీకరణ కేంద్రాలలో తగిన సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, జోనల్ అధికారులను నియమించేలా ఇప్పటికే సిబ్బందిని గుర్తించడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాల బయట కూడా సీసీ కెమెరాలు పెట్టాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్, సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్‌ల కోసం అవసరమైన ఏర్పాట్లు చేశామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ దృష్టికి తెచ్చారు. కాగా ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా ఎన్నికలను సాఫీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణీ కుముదిని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ దేవ సహాయం, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

## నేడు నిరుద్యోగులకు జాబ్ మేళా...

**గద్వాల జనవరి 22, ప్రభాతవార్త:** జిల్లాలో నిరుద్యోగ యువతకు ఈ నెల 23న శుక్రవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పన అధికారి ఎన్.శ్రీ చరణ్ దీప్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగయువతకు శిక్షణతోపాటు ఉపాధిఅవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో జిల్లా ఉపాధికల్పన శాఖ ఆధ్వర్యంలో జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధికల్పన అధికారి ఎన్.శ్రీచరణ్‌దీప్ తెలిపారు. ఈజాబ్‌మేళా జనవరి 23వ తేదీన శుక్రవారం ఉదయం 11.00గంటల నుండి మధ్యాహ్నం2.00గంటల వరకు గద్వాల కలెక్టరేట్‌లోని ఐ.డి.ఓ.సి., ఎఫ్-30/1 సమావేశ మందిరంలో నిర్వహించబడుతుందని ఆయన పేర్కొన్నారు. జాబ్ మేళాలో పాల్గొనే అభ్యర్థులు 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగి ఉండి, ఎస్ ఎస్ సి /ఇంటర్/ ఏదైనా డిగ్రీ అర్హత కలిగి ఉండాలని సూచించారు. జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు ముందుగా అవసరమైన శిక్షణను అందించి, అనంతరం గద్వాల, ఐజ, కర్నూల్ మరియు మహబూబ్‌నగర్ ప్రాంతాల్లోని వివిధ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయని ఆయన వివరించారు. ఈ జాబ్ మేళాలో పుష్కల్ ఆగ్రోటెక్ లిమిటెడ్, బజాజ్ షోరూమ్-గద్వాల, పి.ఎం.కె.కె. - గద్వాల, ఎస్.బి.ఐ, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. కావున జిల్లాలోని అర్హత కలిగిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


జిల్లా ఉపాధి కల్పన అధికారి చరణ్ దీప్

## పెనిమిళ్ళలో ఉచిత గర్భ కోశ వ్యాధి చికిత్స శిబిరం

**ఉప్పునుంతల, జనవరి 22 ప్రభాతవార్త :** మండలంలోని పెనిమిళ్ళ గ్రామంలో గురువారం ఉచిత గర్భ కోశ వ్యాధి ఉచిత చికిత్స శిబిరం నిర్వహించారు. నాగర్ కర్నూల్ జిల్లా పశు సంవర్ధక శాఖ, డిఆర్డిఏ మహబూబ్ నగర్ వారి ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన ఉచిత పాడి పశువుల గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ మేడసాని శ్రీలత విజేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ శిబిరానికి పాడి రైతులు అధిక సంఖ్యలో పాల్గొని గర్భ కోశ వ్యాధి చికిత్స పశువులకు చేయించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ మేడసాని శ్రీలత విజయేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ జైపాల్, పశువైద్యాధికారి డా. ప్రవీణ్ కుమార్ లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు డా. వి. బుచ్చమ్మ, డా. ప్రవీణ్ కుమార్, డా. మల్లేష్, పశువైద్య అధికారులు, పశు వైద్య సిబ్బంది హబీబ్, గోపాల మిత్రలు ఎండి ముజీబ్, గ్రామ విజయ డైరీ సభ్యులు, గోపాలమిత్ర సూపర్‌వైజర్ గట్టు మురళీధర్ రెడ్డి, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి డా. ప్రవీణ్ కుమార్ పలు సూచనలు అందించారు. సకాలంలో గర్భకోశ వ్యాధి పరీక్షలు చేయించి వాటికి చికిత్స చేయించి సరియైన పోషణ ఉంటే సకాలంలో ఎదకు వచ్చి చూళ్ళు కట్టి అవకాశం ఉంటుందని ఆయన వివరించారు. ఈ అవకాశాన్ని పశువుల యజమానులు సద్వినియోగ పరుచుకోవాలని డా. ప్రవీణ్ కుమార్ వివరించారు.


పెనిమిళ్ళ లో ఉచిత గర్వకోశ చికిత్స శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ మెడసాని శ్రీలత విజేందర్ రెడ్డి

## ఈనెల 24 నుంచి శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

**వంగూరు, జనవరి 22 ప్రభాతవార్త:** వంగూరు మండలం గాజర గ్రామంలో వెలిసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈనెల 24 నుండి 26 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ పులిగిల్ల శ్రీపతిరావు పేర్కొన్నారు. 24 శనివారం ఉదయం గణపతి పూజ, పుణ్యవచనము, కంకనాధారం, గ్రామ సకల దేవతలకు అభిషేకం, ఆంజనేయస్వామికి అభిషేకం, లక్ష్మీ గణపతి, వెంకటేశ్వర స్వామి హోమం, మధ్యాహ్నం 3 గంటలకు శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి మూల విగ్రహాలతో గాజర గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. రాత్రి 8 గంటల 45 నిమిషాలకు వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. 25 ఆదివారం ఉదయం 6 గంటలకు ఆలయ ప్రాంగణంలో రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. శ్రీ వెంకటేశ్వర స్వామి మహత్యం 25, 26 రోజులలో రాత్రి 8గంటలకు కళాకారుల బృందం ద్వారా నాటక ప్రదర్శన చేస్తున్నట్లు గ్రామ సర్పంచ్ పేర్కొన్నారు. ఈ బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామి వారి కళ్యాణాన్ని కనులారా తిలకించి స్వామి వారి కృపకు పాత్రులై తీర్థప్రసాదాలను స్వీకరించాలని గ్రామ సర్పంచ్ శ్రీపతిరావు కోరారు.


గ్రామ సర్పంచ్ పులిగిల్ల శ్రీపతిరావు

## దేవరకద్ర మున్సిపాలిటీ బిజెపి కైవసం చేసుకోవాలి

### దేవరకద్ర నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి కొండా ప్రశాంత్ రెడ్డి

**దేవరకద్ర, జనవరి 22 ప్రభాతవార్త:** దేవరకద్ర మున్సిపాలిటీ అన్ని వార్డులో బిజెపి గెలిచి మున్సిపల్ చైర్మన్ కైవసం చేసుకోవాలని కార్యకర్తలకు దేవరకద్ర నియోజకవర్గ బిజెపి ఇన్చార్జి కొండా ప్రశాంత్ రెడ్డి సూచించారు. గురువారం పట్టణ మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బైక్ ర్యాలీలో ముఖ్య అతిథిగా దేవరకద్ర నియోజకవర్గ బిజెపి ఇంచార్జ్ కొండా ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కొత్తగా అయినటువంటి దేవరకద్ర మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలంటే బిజెపి జెండా ఎగరవేయాలి అన్నారు. మున్సిపాలిటీకి వచ్చే నిధులన్నీ కేంద్ర ప్రభుత్వానివే అని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర మండలాధ్యక్షులు కృష్ణంరాజు, తెలంగాణ ఓబీసీ కన్వీనర్ దేవన్నసాగర్, దేవరకద్ర మున్సిపాలిటీ ఇన్చార్జ్ కొండా వెంకటేశ్వర్ రెడ్డి, సత్యనారాయణ, నాగిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి, శ్రీశైలం చారి, యూత్ అధ్యక్షులు రాజు, హోటల్ అంజి, తిమ్మన్న, రాచాల రాజు, వెంకటేష్, గణేష్, దేవరకద్ర మున్సిపాలిటీ చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


బైక్ ర్యాలీలో పాల్గొన్న దేవరకద్ర నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి కొండా ప్రశాంత్ రెడ్డి

## నిజాలను నిర్భయంగా ప్రచురించే పత్రిక "వార్త పత్రిక"

### నూతన క్యాలెండర్ ఆవిష్కరించిన మండల నాయకులు

**నర్వ, జనవరి 22 ప్రభాతవార్త :** వార్తదినపత్రిక 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం నర్వమండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంవద్ద కాంగ్రెస్‌పార్టీ నర్వమండల అధ్యక్షుడు బీసం చెన్నయ్యసాగర్, ఆత్మకూరు మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ డి.కృష్ణారెడ్డిలు నర్వ ఎంపిడిఓ టి.శ్రీనివాసులుతో కలిసి వార్త రిపోర్టర్ మల్లన్‌కోటి శంకర్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచు, ఉప సర్పంచులు క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఈసందర్భంగా చెన్నయ్యసాగర్, కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజలు, ప్రభుత్వం మధ్య వారధిగా పత్రికలు కీలక పాత్ర పోషిస్తు న్నాయన్నారు. ప్రజల సమస్యలను నిరంతరం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో వార్త దినపత్రిక అంకితభావంతో కృషి చేస్తోందని ప్రశంసించారు. భవిష్యత్తులో మరింత నాణ్యమైన వార్తలతో ముందుండి ప్రజల ఆదరాభిమానాలను పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాయికోడ్ గ్రామ ఉప సర్పంచ్ మ్యాతరి గోపాల్, నర్వ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పి.అశోక్ గౌడ్, ఆత్మకూరు మార్కెట్ కమిటి డైరెక్టర్ నరేష్, నర్వ గ్రామ యూత్ ప్రెసిడెంట్ బోయపాటి నరసింహ, నాగిరెడ్డిపల్లి యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ చందు, బెక్కరపల్లి వెంకటయ్య, వడ్ల నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



వార్త దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

## బిఆర్ఎస్ పార్టీలో చేరిన కాంగ్రెస్ నాయకులు

**అలంపూర్ జనవరి 22, ప్రభాతవార్త :** అలంపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముఖ్య కాంగ్రెస్‌నాయకులు ఎమ్మెల్సీ చల్లవెంకట్రాంరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు ఆధ్వర్యంలో టిఆర్ఎస్ పార్టీలో చేరి కండువను కప్పుకున్నారు. కాంగ్రెస్ నాయకుడు ఆసిఫ్ ఖాన్ ఆధ్వర్యంలో తనకార్యకర్తలతో బీఆర్ఎస్‌లో చేరడం జరిగిందని తెలిపారు. అలంపూర్‌లోని త్వరలో జరగబోయే మున్సిపాలిటీ ఎన్నికలలో టిఆర్ఎస్ పార్టీ తరపున నిలబడే కౌన్సిలర్లను గెలిపించుకొని చైర్మన్ సీటు కైవసం చేసుకుంటామని ఆసిఫ్ ఖాన్ తెలిపారు. స్పందించిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, మాట్లాడుతూ అలంపూర్ లోని నిలబడే కౌన్సిలర్లకు అన్నివిధాల సహాయ సహకారాలు అందిస్తామని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరిన కాంగ్రెస్ కార్యకర్తలు

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు

**శ్రీరంగాపూర్, జనవరి 22 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యా మండలి డైరెక్టర్ శ్రీకృష్ణ ఆదిత్య ఐఏఎస్ ఆదేశాల మేరకు ఉదయం 10 గం.లకు విద్యార్థుల తల్లిదండ్రుల అధ్యాపకుల ఆత్మీయ సమావేశం (మెగా టిపిఎం) నిర్వహిస్తున్నారు. ఈ సమావేశానికి వనపర్తి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి అంజయ్య ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారు. కనుక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు ఈ ఆత్మీయ సమ్మేళనానికి ఖచ్చితంగా హాజరు కావాలని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మోజెస్ తెలియజేయడం జరిగింది.

## గోశాలకు గోవుల తరలింపు


ప్రొసీడింగ్ కాపీని అందజేస్తున్న మాజీ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి

**చిన్న చింతకుంట, జనవరి 22 ప్రభాతవార్త :** కొలిచిన వారికి కొంగుబంగారంగా దీవెనలు అందించే శ్రీ కురుమూర్తి స్వామికి భక్తులు మొక్కుల రూపేనా కోడెదూడలను సమర్పించడం ఇక్కడ అనవాయతీ. అలా స్వామివారికి సమర్పించిన ఐదు గోవులను గురువారం హన్వాడ మండలం చిన్నదర్పల్లిలోని శ్రీ లక్ష్మీ గోశాలకు తరలించినట్లు ఆలయ ఈవో మదనేశ్వర్ రెడ్డి తెలిపారు. గూడూరు గ్రామంలోని శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో దీప, దూప, నైవేద్యానికి గాను దేవాదాయ ధర్మాదాయ శాఖ మంజూరు చేయగా దానికి సంబంధించిన ప్రొసీడింగ్ కాపీని అర్చక పూజారి వెంకట రంగయ్యకు మాజీ దేవస్థాన చైర్మన్ గోవర్ధన్ రెడ్డి అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే జి .మధుసూదన్ రెడ్డి ఆదేశానుసారం ఈ ప్రొసీడింగ్ కాపీని అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ పాలకమండలి సభ్యులు భాస్కరాచారి, కమలాకర్, నాగరాజు, భారతమ్మ, గోపాల్, చక్రవర్ధన్ రెడ్డి, ఆలయ అర్చకులు ఉన్నారు.

### రోడ్డుపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ

## భద్రత ప్రమాణాలు పాటించాలి



రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న తహసిల్దార్ కార్తీక్ కుమార్

**వెల్దండ, జనవరి 21 ప్రభాతవార్త:** రోడ్డుపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ రోడ్డుభద్రత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని తహసిల్దార్ కార్తీక్ కుమార్ అన్నారు. వెల్దండ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్, ఎంపిడిఓ కార్యాలయాల ముందు పోలీసుల ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా తహసిల్దార్ కార్తీక్ కుమార్ మాట్లాడుతూ జీవితం ఎంతో విలువైందని, అతివేగం ప్రమాదమని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, హెల్మెట్ ధరించకపోవడం అనేక కారణాలతో ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. తప్పనిసరిగా సూచనలు పాటించి విలువైన ప్రాణాలు కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో డీటీ మొహమ్మద్ అలీ, ఏఎస్ఐ శ్రీనివాసులు, ఎంపీడీవోకార్యాలయ సూపరింటెండెంట్ మోహన్‌లాల్, లక్ష్మణ్, పోలీస్ సిబ్బంది నవీన్‌యాదవ్, గోపి తదితరులు ఉన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థిక సహాయం అందజేస్తున్న సర్పంచ్ నర్మద సలేశ్వరం

**వంగూరు, జనవరి 22 ప్రభాతవార్త:** వంగూరు మండలం ఉల్లంపల్లి గ్రామానికి చెందిన గోరెంకల లక్ష్మయ్య గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం ఉదయం మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ నర్మద సలేశ్వరం మృతుడు కుటుంబాన్ని పరామర్శించి రూ. 5వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. అదేవిధంగా మృతుడు కుటుంబానికి అన్ని తానై దహన సంస్కరణల ఏర్పాట్లు పూర్తిగా నిర్వహించి కుటుంబ సభ్యులకు అండగా నిలిచి మానవత దృక్పథాన్ని చాటుకున్నారు. పరామర్శించిన వారిలో ఉపసర్పంచ్ యాదగిరి, మాజీసర్పంచ్ బక్కయ్య, వార్డుసభ్యులు అంజయ్య, రమేష్ తిరుపతయ్య, మల్లయ్య, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

## డీలర్ల మండల నూతన కమిటీ ఏర్పాటు



డీలర్ల మండల నూతన కమిటీ

**ధన్వాడ,జనవరి 22 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ధన్వాడలో రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన లక్ష్యంగా డీలర్ల మండల నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ కార్యాలయం సమీపంలో జరిగిన సమావేశంలో డీలర్ల ఏకగ్రీవ సమ్మతితో నూతన కమిటీని ప్రకటించారు. ఈ కమిటీలో మండల అధ్యక్షులుగా వెంకట లక్ష్మమ్మ, ఉపాధ్యక్షుడిగా నారాయణ నాయక్, ప్రధాన కార్యదర్శిగా బాలప్ప, సభ్యులుగా యాదయ్యను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమం తహసిల్దార్ సింధుజ సమక్షంలో జరగగా ఆమె నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. డీలర్లు ప్రజలకు నిత్యావసర సరుకులు అందించే కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. అలాగే డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు సహకరిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సకీరప్ప,రాజునాయక్, డీలర్ బాబాఅమృత, పాతపల్లి గోపాల్ తదితర పలువురు డీలర్లు పాల్గొన్నారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో డీలర్ల సమస్యలపై ఐక్యంగా పోరాడుతూ ప్రభుత్వానికి డిమాండ్లను తెలియజేస్తామని నాయకులు తెలిపారు. డీలర్ల హక్కుల పరిరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే నూతన కమిటీ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## నైపుణ్యం పెంపునకే శిక్షణ తరగతులు



ఉపాధ్యాయులతో ఏఎంఓ విద్యాసాగర్

**నర్వ, జనవరి 22 ప్రభాతవార్త :** వృత్తి నైపుణ్యం పెంపొందించుకునేందుకు మండల స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏఎంఓ విద్యాసాగర్ వెల్లడించారు. శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నర్వ మండలంలోని ఉపాధ్యాయులకు నర్వ మండల కేంద్రంలోని మండల పరిషత్ ఉన్నత పఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలను గురువారం ఆయన పరిశీలించిమాట్లాడారు. శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని,విద్యార్థులకు అత్యుత్తమమైన బోధన చేయాలన్నారు. కోఆర్డినేటర్ శ్రీనివాసులు, ఎంఈఓ రాంరెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సునీత,బషీర్ అహ్మద్, టీచర్స్ దామోదర్‌రెడ్డి,సత్యనారాయణ రెడ్డి,విజయలక్ష్మి ్ర, నిహారిక, వెంకటేశ్వర్లు, సిఆర్‌పి నర్సిములు ఉన్నారు.

## భార్య అక్రమ సంబంధం పెట్టుకుందని భర్త ఆత్మహత్య



మృతుడు శివకుమార్ (ఫైల్)

**నవాబుపేట, జనవరి 22 ప్రభాతవార్త:** గత కొంతకాలంగా తన భార్య వేరే వారితో అక్రమ సంబంధం పెట్టుకుందని మనస్థాపానికి గురైన భర్త ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన నవాబుపేట మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై విక్రం తెలిపిన వివరాల ప్రకారం నవాబుపేట గ్రామానికి చెందిన మహమ్మదాబాద్ కృష్ణయ్య (35) భార్య లలితకు ఇద్దరు సంతానం. కొద్ది రోజులుగా కృష్ణయ్య భార్య లలితకు వేరే వారితో అక్రమ సంబంధం పెట్టుకుందని భార్యాభర్తల మధ్యలో తరచూ గొడవలు పడుతూ మనస్థాపానికి గురై తన ఇంట్లోనే వెంటిలేటర్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## శ్రీశైలం పాదయాత్ర కరపత్రాలను విడుదల చేసిన గురూజీ

**అయిజ జనవరి22, ప్రభాతవార్త:** మండల పరిధిలోని వెంకటపురం స్టేజీలో గురువారం కర్ణటక రాష్ట్రంలోని సోలాపూర్ నుంచి శ్రీశైలం వరకు పాదయాత్ర 51వ షెడ్యూల్ కరపత్రాలను పింజరి లేకన్ ఇంటి దగ్గర సోలాపూర్ నుంచి వచ్చిన గురువు వెంకటాపురం ఉపసర్పంచ్ చిన్న భీమన్న కిష్టాపురం సర్పంచ్ కుమ్మరి జయమ్మ భర్త నరేష్ లతో కలిసి పాదయాత్ర కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ లోక కళ్యాణం కోసం భక్తులతో కలిసి పాద యాత్రతో శ్రీశైలం చేరుకుంటారు. ఇదే నేపథ్యంలో వారు వెంకటాపురం స్టేజికి 09/03/2026 రోజున చేరుకుంటామని స్వామి తెలిపారు. ఇందులో భాగంగానే సోలాపూర్ నుంచి శ్రీశైలం వరకు పాదయాత్ర 51వ షెడ్యూల్ కరపత్రాలను విడుదల చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షులుగా కేశవాపూర్ నర్సి ములు



**కోయిలకొండ జనవరి 22, ప్రభాతవార్త:** కోయిలకొండ మండల రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షులుగా కేశవాపూర్ నర్సి ములు ను ఆ సంఘం సభ్యులు కలసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునితో పాటు నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు .మండల రేషన్ డీలర్ల సంఘం ప్రధాన కార్యదర్శిగా దమాయపల్లి కే ప్రవీణ్ చారి, కోశాధికారిగా ఏ నాగరాజు, కన్వీనర్ గా ఎస్ ఆనంద్, అడ్వైజర్‌గా విట్టల్ నాయక్, ఉపాధ్యక్షులుగా ఎస్ రాజు, కేశవులు.... సంయుక్త కార్యదర్శులుగా ఎం రామునాయక్, షాజిదాబేగం, ప్రచార కార్యదర్శులుగా ఆలూరి భీమయ్య, ప్రవీణ్, బాలయ్య, కార్యవర్గ సభ్యులుగా వెంకటేశ్వరమ్మ, శ్రీనివాసులు, విజయ్ కుమార్, సంజీవ్ రెడ్డి, ఎల్ బాసు, జి సుజాత తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నుకోబడ్డ మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు నర్సి ములు మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి నన్ను మండల అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు తోటిడీలర్ లందరికీ కృతజ్ఞతలు తెలిపారు. డీలర్ల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతుగా కృషి చేస్తానన్నారు. అనంతరం మండల రేషన్ డీలర్ల సంఘం నూతన కార్యవర్గం ఏర్పడిందని మండల తహసిల్దార్ రాజా గణేష్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు.

## కెటిదొడ్డి మండలాన్ని బాల్య వివాహాలు లేని మండలంగా మార్చడానికి కృషి చేయాలి

**కేటిదొడ్డి జనవరి 22, ప్రభాతవార్త:** గురువారం కేటిదొడ్డి మండలంలోని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో బాలల సంరక్షణ అద్వర్యంలో బాల్యవివాహం ముక్తభారత్ వందరోజుల ప్రోగ్రాంలో భాగంగా బాల్య వివాహ నిర్మూలన పైన సర్వీస్ ప్రొవైడర్స్ చట్టం 2006 గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కేటి దొడ్డి మండలం సోషల్ వర్కర్ ఇంచార్జీ పద్మ మాట్లాడుతూ. అమ్మాయిలకు 18 సంవత్సరాలు నిండకముందు, అబ్బాయిలకు 21 సంవత్సరాలు నిండకముందు పెళ్లి చేస్తేచట్టారీత్యా నేరం అదేవిధంగా రెండుసంవత్సరాలు జైలు శిక్ష, లక్ష రూపాయలు జరిమానా విధించడం జరుగుతుంది కావున మీ పరిధిలో అమ్మాయిలకు 18 సంవత్సరాలు నిండకముందు పెళ్లిచేసుకున్నట్టు తెలిస్తే1098 చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఫోన్‌చేసి తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సూపర్డెంట్ రాజశేఖర్, ఏ పీ ఓ, ఎం విఏఫ్‌కార్యకర్త రాజేశ్వరి, డి హెచ్ ఈ డబ్ల్యూ సిబ్బంది, చైల్డ్ హెల్ప్ లైన్ సూపర్వైజర్ సరంగిణి, ఓఆర్‌డబ్ల్యు లక్ష్మీదేవి, సోషల్ వర్కర్ పద్మ,, పాస్టర్లు, పూజారులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## బ్రిడ్జి నిర్మాణ పనులు నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలి

◆ అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ



కొత్త బస్టాండు సమీపంలో నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీ కృష్ణ

**ఉప్పునుంతల, జనవరి 22 ప్రభాతవార్త:** కొత్త బస్టాండ్ సమీపంలో నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణపు పనులను తమిళనాడు ఏఐసీసీ పరిశీలకులు, టిపిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ పరిశీలించారు. పనులు వేగవంతంగా, నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని గుత్తేదారులను ఆదేశించారు. పట్టణ నడిబొడ్డున ఉన్న ఈ బ్రిడ్జి నిర్మాణం చేపట్టడంతో కొత్త బస్టాండ్ సమీపంలో నీరు ఎప్పటికప్పుడు వెళ్లిపోవడానికి చాలా సులువుగా ఉంటుందని పేర్కొన్నారు. పరిశీలించిన వారిలో ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణతో పాటు జిల్లా గ్రంథాలయ చైర్మన్ గంగా పురం రాజేందర్, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి రజిత మల్లేష్, మాజీ ఎంపీపీ రామనాథం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అడుపాల గోపాల్ రెడ్డి, అచ్చంపేట పాలశీతలికరణ చైర్మన్ నరసయ్య యాదవ్, మాజీ సర్పంచ్ లోక్య నాయక్, సుంకరి బాల్ రాజు ఉన్నారు.

## రైతులకు నిరంతరం అండగా ఉంటా..

◆ అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు ◆ రైతులకు వ్యవసాయ పనిముట్ల యంత్రాలను అందజేసిన ఎమ్మెల్యే



పరికరాలను అందజేస్తున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

**అలంపూర్ జనవరి 22, ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం ఉండవల్లి మండల కేంద్రంలోని రైతు వేదిక వద్దగురువారం జిల్లా వ్యవసాయ అధికారి శక్రియ నాయక్ అలంపూర్ శాసనసభ్యులు విజయుడు రైతులకు వ్యవసాయ పనిముట్ల యంత్రాలను అందజేశారు. ఈ యంత్రాలతో రైతులు తక్కువ సమయం, తక్కువ ఖర్చుతో సులభంగా ఎక్కువ లాభాలు పొందగలరని ఆయన తెలిపారు. అనంతరం మాట్లాడిన ఎమ్మెల్యే విజయుడు అలంపూర్ నియోజకవర్గంలో వ్యవసాయాన్ని సాగు చేసేరైతుల కష్టాలనుతొలగించేందుకు నిరంతరం పనిచేస్తున్నాము. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఇచ్చే యాంత్రీకృత పనిముట్లను ఉపయోగించడం వల్ల రైతులు తక్కువ శ్రమతో ఎక్కువ ఫలితాలు సాధించవచ్చు అని అన్నారు. ఆలంపూర్ నియోజకవర్గ ప్రజల, ముఖ్యంగా రైతులకు నిరంతరం అండగా ఉంటాను అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ అనిత, అధికారులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు దొడ్డప్ప, జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్రీను, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పార్టీ శ్రేణులు కార్యకర్తలు, అగ్రికల్చర్ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల మెరుగుకు కృషి చేయాలి



ఆవుసలికుంట పాఠశాలను సందర్శించిన జిల్లాస్థాయి పర్యవేక్షణ బృందం

**లింగాల, జనవరి 22 ప్రభాతవార్త:** విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను మెరుగుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లాస్థాయి పర్యవేక్షణ అధికారులు నాగరాజు,బృంగి కృష్ణప్రసాద్, ఈశ్వరయ్య అన్నారు. గురువారం లింగాల మండల పరిధిలోని ఆవుసలికుంట, జీల్గుపల్లి,దత్తారం గ్రామాల పాఠశాలలో పర్యటించారు. పాఠశాలలోని రికార్డులను, రిజిస్టర్ పరిశీలించారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా పాఠశాలలోని తరగతి గది పరిశీలనలో ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఆయా తరగతుల్లో సాధించాల్సిన అభ్యసన, సామర్థ్యాలను తరగతి గదిలో ప్రదర్శించాలని సూచించారు. 3వ తరగతిలో విద్యార్థుల సామర్థ్యాలు ఎఫ్ఎల్ఎస్ విధానంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి ఉపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు తాము బోధించే విషయాల అభ్యాస, సాధనా పత్రాలు తప్పనిసరిగా సరిదిద్ది సంతకము చేయాలని సూచించారు. పాఠశాలలో పర్యవేక్షణ సమయంలో 73 మంది విద్యార్థులు గానూ 63 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉపాధ్యాయులు ముగ్గురికి ముగ్గురు హాజరయ్యారు. ఎఫ్ఆర్ఎస్ నమోదు చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన, మధ్యాహ్న భోజన నిర్వహణ సక్రమంగా ఉండడంతో జిల్లాస్థాయి పర్యవేక్షణ బృందం సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి బషీర్ అహ్మద్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేయాలి

రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి, ఎమ్మెల్యే సోదరుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోదరుడు భాస్కర్‌రెడ్డి

**దేవరకద్ర, జనవరి22 ప్రభాతవార్త:** రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ గెలుపే ధ్యేయంగా యువజన కాంగ్రెస్ నాయకులు కష్టపడి పనిచేయాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం దేవరకద్ర నియోజకవర్గస్థాయి యువజన కాంగ్రెస్ విభాగం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శివచరణ్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి సోదరుడు జి భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నాయకులకు టికెట్ల కేటాయింపులో తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టాన్ని నీరుగారుస్తున్నదని ఆరోపించారు. చట్టంలో గాంధీ పేరు తొలగించడం సరికాదన్నారు. పేదల హక్కును కాలరాయడానికి చట్టాన్ని మార్చిందని ఆరోపించారు. ఉపాధిహామీ పథకాన్ని యధావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో యువజన కాంగ్రెస్ అధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఎమ్మెల్యే సోదరుడు భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీలో యువజన విభాగానికి ఎంతో ప్రాధాన్యత ఉంటుందన్నారు. పార్టీలో యువజన నాయకులకు ఎంతో భవిష్యత్తు ఉందన్నారు. యువజన విభాగం గట్టిగా ఉంటేనే కాంగ్రెస్ పార్టీ బలంగా ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో దేవరకద్ర నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిజాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది

- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి
- జర్నలిస్టులు కాని వారిపై దృష్టి సారిస్తాం : వనపర్తి జిల్లా ఎస్పీ సునీత రెడ్డి
- టియూడబ్ల్యూజె (ఐజేయు) డైరీ ఆవిష్కరణ



యూనియన్ డైరీని ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్, యూనియన్ నాయకులు

**వనపర్తి, జనవరి22 ప్రభాతవార్త:** జర్నలిజాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. గురువారం తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఐజేయు) డైరీ, జిల్లా అధ్యక్షులు మాధవరావు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ సునీత రెడ్డి యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జి.మధు గౌడ్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆదర్శ సురభి మాట్లాడుతూ సమాజంలో జర్నలిజం నాలుగో స్తంభం లాంటిదని,జర్నలిస్టులు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ వార్తలను అందించాలని, ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి పరిష్కారమయ్యే విధంగా ఉండాలని సూచించారు. జర్నలిజాన్ని,వాటి విలువలను కాపాడాల్సిన బాధ్యత, ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ప్రలోభాలకు లొంగకుండా నిజా యితీగా వార్తలు అందించాలన్నారు. జిల్లా ఎస్పీ సునీత రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులు కానివారి పై దృష్టి సారిస్తామన్నారు. జర్నలిస్టుల ముసుగులో అక్రమ వసూళ్లకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పనిచేసే జర్నలిస్టులకు మా సహకారం ఎప్పుడూ ఉంటుందని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. నూతన అక్రిడేషన్లు వచ్చిన వెంటనే తమ పరిధిలో జర్నలిస్టులకు, గుర్తింపుగా వారి వాహనాలకు స్టిక్కర్‌ను అందిస్తామని తెలిపారు. ఈ మధ్యకాలంలో జర్నలిస్టులు కాని వాళ్ళు ప్రెస్ అని వాహనాలకు, అంటించుకొని తిరుగుతున్నారని తమ దృష్టికి వచ్చిందని, అక్రిడేషన్ కార్డు ఉన్నవారు మాత్రమే, వాహనాలకు స్టిక్కర్ ఉండాలని తెలిపారు. జర్నలిస్టులు, సమస్య ఉన్న వార్తను మాత్రమే తమ దృష్టికి తేవాలని తెలిపారు. యూనియన్ రాష్ట్రకార్యదర్శి జి.మధు గౌడ్ మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డు ఇవ్వాలని, జర్నలిస్టు భవన్ కు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు అయేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్ఓ సీతా రాములు, ఎస్పిపిఆర్ఓ రాజగౌడు, జాతీయ కౌన్సిల్ సభ్యులు మల్యాల బాలస్వామి, రాష్ట్రహౌస్ సైట్ కో కన్వీనర్ జి.శ్రీనివాస రావు, సీనియర్ పాత్రికేయులు పోలిశెట్టి బాలకృష్ణ ,నాగేంద్ర చారి, వెంకట్ గౌడు, జిల్లా కోశాధికారి మన్యం, జిల్లా కార్యదర్శి ,కమల్ రెహమాన్ చిన్న రాజు, క్రమశిక్షణ కమిటీ సభ్యులు పికిలి రాము, తిరుపతయ్య, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి నరసింహ రాజ్, ప్రచార కార్యదర్శి రవి, పట్టణ అధ్యక్షులు తైలం అరుణ్ కుమార్, కార్యదర్శి సి.ఆంజనేయులు, పి.ఆర్ టివి సీఈవో చంద్రమౌళి, లోకేష్ పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మిచెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**గద్వాల జనవరి 22, ప్రభాతవార్త:** గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గద్వాల మండల సంబంధించిన కళ్యాణి లక్ష్మి/ షాదీముబారక్, చెక్కులను ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి పంపిణీ చేశారు. గద్వాల మండలంలోని పరిధిలోని వివిధ గ్రామాల చెందిన 130 మంది ఆడపడుచులకు కళ్యాణ లక్ష్మి/ షాదీ ముబారక్, చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ చేతులమీదుగా 1 లక్ష 116 రూపాయలు చెక్కులను అందజేయడం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ నేను ఎమ్మెల్యేగా గెలిచిన ప్పటి నుండి గద్వాల నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేయడం జరుగు తుందని, గతంలో నాయకులు గద్వాల నియోజక వర్గాని సరిగ్గా పట్టించు కోనందున మన ప్రాంతం చాలా వెనుక పడిందన్నారు. గద్వాల నియోజకవర్గం వైద్యరంగం అభివృద్ధి చెందాలని అహర్నిశలు కృషి చేయడం జరిగిందనీ, మెడికల్ కాలేజ్ ,నర్సింగ్ కాలేజ్, 300 పడకల హాస్పిటల్, సి.సి రోడ్లు డ్రైనేజీ, ప్రధాన రహదారులు రోడ్డు నిర్మాణంలో, జూనియర్ కాలేజీ, గురుకుల పాఠశాలలు అభివృద్ధి కార్యక్రమాలను చేసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, మాజీ జడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ జంబు రామన్ గౌడు, మాజీ జిల్లా రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు చెన్నయ్య, జిల్లా సీనియర్ నాయకులు రమేష్ నాయుడు, మహేశ్వర్ రెడ్డి, గోపిరెడ్డి, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

### పాఠశాలల్లో ఓటు విలువపై విద్యార్థుల ప్రతిజ్ఞ

**ఉప్పునుంతల, జనవరి22 ప్రభాతవార్త:** జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించేందుకు విద్యాశాఖ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ మేరకు మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచనలు జారీ చేయగా నేడు శుక్రవారం ఉదయం 11 గంటలకు విద్యార్థుల చేత ఓటర్ల ప్రతిజ్ఞ చేయించాల్సిందిగా ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో భాగంగా పాఠశాల ప్రాంగణాల్లో జాతీయ జెండా ఆవిష్కరణ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు పాత్రపై ఉపాధ్యాయుల ప్రసంగాలు, విద్యార్థుల చేత ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఓటు అనేది ప్రతి పౌరుడికి ఉన్న విలువైన హక్కు అని, బాధ్యతాయుతంగా ఓటు వేయడం ద్వారా దేశ భవిష్యత్తును నిర్మించవచ్చని విద్యార్థులకు వివరించనున్నారు. విద్యార్థులు చిన్న వయసు నుంచే పౌర బాధ్యతలను తెలుసుకొని, ప్రజాస్వామ్యంపై అవగాహన పెంచుకోవాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అన్ని పాఠశాలలు నిర్దేశిత సమయానికి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి నివేదికలను సంబంధిత అధికారులకు పంపించాలని సూచించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా చేపట్టే ఈ ప్రతిజ్ఞ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో దేశభక్తి, సామాజిక బాధ్యత, ప్రజాస్వామ్య విలువలుమరింతబలపడుతాయని విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు.

## రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సమావేశంలో పాల్గొన్న టిపిసిసి బీసీ విభాగం ఉపాధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్ యాదవ్




**శ్రీరంగాపూర్, జనవరి 22 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, టిపిసిసి ఓబిసి విభాగం అధ్యక్షులు నూతి శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథులుగా పిసిసి అధ్యక్షులు మహేష్ గౌడు, తెలంగాణ రాష్ట్ర ఓబిసి విభాగ ఏఐసీసీ ఇంఛార్జిలు సాహూ జి, సంజయ్ పాల్, జాతీయ ఓబీసీ కోఆర్డినేటర్ సంతోష్ రుద్ర పాల్గొన్నారు. రాజేంద్రప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ ఎంజిఎన్ఆర్ఇజిఏ బచావో కార్యక్రమాన్ని అన్ని జిల్లాల్లో మండలాల్లో గ్రామాల్లో నిర్వహించాలని కోరారు. ఇటీవల నిర్వహించిన సర్పంచ్ ఎన్నికలలో బీసీలకు ప్రాధాన్యత ఇచ్చి ఘన విజయం సాధించిన అభ్యర్థులకు అవకాశం కల్పించిన రేవంత్ రెడ్డికి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. బీసీలకు ప్రభుత్వ నామినేటెడ్ పదవులలో ప్రాధాన్యత కల్పించాలని కోరడం జరిగింది. ఓబిసి విభాగానికి ప్రత్యేక జెండా లోగోను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భారతీయత్రి మాజీ ఓబీసీ కోఆర్డినేటర్ చేతూరి వెంకటేష్ గౌడ్, మాజీ ఓబీసీ అధ్యక్షులు కత్తి వెంకటస్వామి, ఓబీసీ వైస్ చైర్మన్లు తాండు శ్రీనివాస్ ముదిరాజ్, బండి ప్రభాకర్, వనపర్తి జిల్లా ఎన్ఎస్‌యుఐ మాజీ అధ్యక్షులు రోహిత్ తదితర ముఖ్య కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## లంకాలలో వైద్య క్యాంపు ఏర్పాటు



లంకాల గ్రామంలో వైద్య క్యాంపు నిర్వహించిన దృశ్యం

**నర్వ, జనవరి22 ప్రభాతవార్త:** నర్వ మండలంలోని లంకల గ్రామంలో గురువారం మండల వైదులు వైద్య క్యాంపు నిర్వహించారు. గత కొద్ది రోజులుగా గ్రామంలోని చిన్నారులకు,పెద్దలకు సైతం అమ్మతల్లి సోకడం జరుగుతుంది. దీంతో గ్రామ సర్పంచ్ శివకుమార్ రెడ్డి,ఉప సర్పంచ్ విజయ్ ఆధ్వర్యంలో వైద్య అధికారికి వెంకటరమణ తోపాటు వైద్య సిబ్బంది గ్రామంలో అమ్మ తల్లి సోకిన చిన్నారులను పరిశీలించారు. గ్రామంలో వైద్య బృందం పురవీధుల గుండా సందర్శించి అమ్మ తల్లి సోకిన చిన్నారులకు చికిత్సలు నిర్వహించారు. గ్రామంలో వ్యాధి ప్రబలకుండా గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ రాములు తో పాటు వైద్యసిబ్బంది సంకీర్తన, మంజుల, ఆశాజ్యోతి, పంచాయతీ కార్యదర్శిరాజబాబు, ఆశావర్కర్లు,అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

## జగన్మోహన్ రెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే



జగన్మోహన్‌రెడ్డిని పరామర్శిస్తున్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

**నవాబుపేట, జనవరి22 ప్రభాతవార్త:** పర్వతాపూర్ మైసమ్మ ఆలయ చైర్మన్ జగన్మోహన్ రెడ్డిని జడ్చర్ల శాసనసభ్యులు అనిరుధ్ రెడ్డి గురువారం మండల కేంద్రంలోని కాకర్లపాడు ఆయన స్వగృహంలో పరామర్శించి తన యుగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల జరిగిన పర్వతాపూర్ మైసమ్మజాతర బ్రహ్మోత్సవాల ఊరేగింపులో మైసమ్మ ఆలయచైర్మన్ అదుపు తప్పిబండి పై నుంచి కింద జారిపడగాకాలు ఫ్రాక్చర్అయింది. ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డితో పాటు ప్రజా ప్రతినిధులు, నాయకులు, సింగల్ విండో కౌన్సిలర్‌లు సర్వరాజు, అశోక్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు దామోదర్‌రెడ్డి, పాశం రామస్వామి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

**శ్రీరంగాపూర్, జనవరి 22 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కాలనీకి చెందిన కేశపాక బుడన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. మృతుని కుటుంబానికి అండగా మేమున్నామంటూ వారి కుటుంబానికి ధైర్యాన్ని ఇస్తూ అంబేద్కర్ యువజన సంఘం వారి ఆధ్వర్యంలో ఆర్థిక సహాయంగా రూ. 9400లను ఇవ్వడం జరిగింది. అంబేద్కర్ యువజన సంఘం కోశాధికారి బి.అశోక్,సహాయ కార్యదర్శి రాములు,డి.శ్రీనివాసులు, సురేష్, ముని, రమేష్, సద్దు, వెంకటేష్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## శివకుమార్ రెడ్డిని కలిసిన అనంతపూర్ కాంగ్రెస్ పార్టీ నేతలు

**కోయిలకొండ జనవరి 22, ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డిని గురువారం కోయిలకొండ మండలం అనంతపూర్ కాంగ్రెస్ పార్టీ నేతలు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా వారు గ్రామ అభివృద్ధి పై చర్చించారు. గ్రామానికి అధిక నిధులు ఇవ్వాలని గ్రామస్తులు కోరారు. గ్రామానికి కావాల్సిన ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు త్వరలోనే గ్రామానికి వచ్చేలా కృషి చేస్తానని శివకుమార్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు గ్రామ కాంగ్రెస్ పార్టీ నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మోహన్ ,ఇందిరమ్మ కమిటీ సభ్యులు మున్నూరు భీమ్‌రెడ్డి, గోవింద్ రెడ్డి, భీమయ్య, చిన్న రాములు తదితరులు పాల్గొన్నారు.

## నదిలోకే హిటాచీలు..! ఇసుకను తోడేస్తున్నారు..

మెదటి పేజీ తరువాయి భాగం.. ఆయా గ్రామస్తులు బాహాటంగానే చర్చించుకుంటున్నారు.



ఇసుక టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు

**ఐదు హిటాచీలు సీజ్:** పట్టపగలు కృష్ణ నదిలో ఎలాంటి అనుమతులు లేని అక్రమ ఇసుక రవాణాను అడ్డుకుని నదిలో ఉన్న ఐదు ఇటాచిలను, ఒక టిప్పర్‌ను సిజ్ చేసినట్లు మండల తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. కృష్ణ మండలం పరిధిలోని గుడేబాల్లూరు, ముడుమాల్ గ్రామ శివారులోని కృష్ణ నదిలో ఎలాంటి అనుమతులు లేకుండా భారీ ఇసుక తవ్వాకల రవాణా జరుపుతుండగా గ్రామస్తులు, ట్రాక్టర్ల డ్రైవర్ల మధ్య గొడవల కారణంగా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందడంతో తహసీల్దార్ శ్రీనివాస్ రెవెన్యూ అధికారులతో గురువారం సాయంత్రం కృష్ణనదిలో పరిశీలించి, అక్కడ ఎలాంటి అనుమతులు లేకుండా పట్టపగలుఅక్రమ ఇసుక దారులు ఇసుక తవ్వకాలు జరుపుతున్న ఐదు ఇటాచిలు,ఒక టిప్పర్ పట్టుకుని సిజ్ చేసినట్లు మండలం తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. సిజ్ చేసిన ఐదు ఇటాచిలు, ఒక టిప్పర్ పోలీసులు అప్పగించినట్లు అయన తెలిపారు. ఇక మీదట కృష్ణ నదిలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు, అక్రమ రవాణా జరగనివ్వమని ఒకవేళ జరిగితే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అయన హెచ్చరించారు.

## ప్రశ్నించే వార్త పత్రికగా మన ప్రభాతవార్త

◆ పశ్నించకే సమాధానం ఇవ్వడం వార్త కే సాధ్యం
◆ రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



వార్త క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి జూపల్లి

**కొల్లాపూర్, జనవరి 22 ప్రభాతవార్త:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 30 ఏళ్ల పత్రిక రంగంలో ప్రశ్నిస్తూ.. సమాధానాన్ని సహితం సూచిస్తూ... ప్రజల మన్ననలు పొంది సామాన్యుల పత్రిక గా పేరుగాంచి వార్తగా, ప్రతి నిత్యం ప్రభాతవార్త పత్రికగా వార్త దినపత్రిక గత 30 సంవత్సరాలుగా ప్రభుత్వాలనే గడగడలాడించిన గొప్ప చరిత్ర గలదని, మారుమూల గ్రామాలకు సైతం సామాన్యుల పత్రికగా వార్తాపత్రిక విరజిల్లడం జరిగిందని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావుఅన్నారు.గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజక వర్గ కేంద్రంలో వార్తదినపత్రిక క్యాలెండర్‌ను కాన్స్టెన్సీ రిపోర్టర్ పెరుమాళ్ళ శ్రీనివాస్‌తో కలిసి ఆవిష్కరించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ కొల్లాపూర్ నియోజక వర్గంలో ప్రశ్నించే తత్వాన్ని కలిగిన రిపోర్టర్లు ఉండడంఈ ప్రాంత ప్రజలు చేసుకున్న గొప్పతనమని, అందులో ముఖ్యంగా వార్త దినపత్రిక అభివృద్ధికి సంబంధించిన వార్తలను ప్రచురిస్తూ అభివృద్ధి, నిరక్ష్యాన్ని ప్రశ్నించే తత్వంతో ప్రజలకు దగ్గరై నా ప్రధాన పత్రికలలో ఒకటైన సాంప్రదాయ పద్ధతిలో వార్త దినపత్రి కను నిత్యం ప్రజలు చదవాలని, నియోజకవర్గంలోని ప్రతి లైబ్రరీలో వార్తా పత్రిక ఉండేవిధంగా చూడాలని మంత్రి అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం వార్తా పత్రికను నిత్యం ప్రోత్సహిస్తుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

◆ చికిత్స పొందుతూ ఒకరు మృతి ◆ మరో వ్యక్తికి గాయాలు
◆ ఎస్సై వెంకటేశ్వర్లు గౌడ్



**లింగాల, జనవరి 22 ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందగా, మరో వ్యక్తికి గాయమైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేశ్వర్లు గౌడ్ కథనం మేరకు ఈ నెల 18న సాయంత్రం సమయంలో గెంటెల తిరుపతయ్య, బాలచంద్రం ఇద్దరు కలిసి ద్విచక్ర వాహనంపై నాయినపల్లి మైసమ్మ ఆలయానికి వెళ్ళి తిరిగి వస్తుండగా అంబట్ పల్లి,శాయిన్ పేట రోడ్డులో మూల మలుపు వద్ద ఎదురుగా వచ్చిన క్రెటా కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో తిరుపతయ్య, బాలచంద్రం ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. గెంటెల తిరుపతయ్య హైదరాబాద్ లో చికిత్స పొందుతూ బుధవారంరాత్రి మృతి చెందినట్లు తెలిపారు. మృతుని తమ్ముడు గెంటెల విష్ణు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఎంవిఎస్‌లో ఉద్యోగ మేళా

164 మందికి వివిధ కంపెనీలలో ఉద్యోగాలు

**మహబూబ్‌నగర్, జనవరి 22 ప్రభాతవార్త :** ఎంవిఎస్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల, నిర్మాణ్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఉద్యోగ మేళాను నిర్వహించారు.ఈ ఉద్యోగమేళా ద్వార 164 మందికి వివిధ కంపెనీలలో ఉద్యోగ అర్హత సాధించారు. ముఖ్యంగా అపోలో పార్మసీ, టాటా ఫైనాన్స్, అమెజాన్, ప్లిసా కార్ట్ మత్తూ ట్ ఫైనాన్స్, హిందూజ ఫైనాన్స్,స్వీట్ బ్యాంక్ ఆఫ్ ఇండియం మెడ్స్, క్వెస్ క్రావ్, విజన్ ఇండియా వంటి 18 కంపెనీలు కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపికైన అభ్యర్థులకు ఆఫర్ లెటర్స్ కూడా అందించారు. ఈ సం దర్భంగా క ళాశాల ప్రిన్సిపల్ ప్రొ॥ డా కె.పద్మావతి మాట్లాడుతూ 18కంపెనీల నుండి వచ్చిన హెచ్ ఆర్‌ఎంలకు కృతజ్ఞతలు తెలిపారు.మహబూబ్‌నగర్ నిరుద్యోగ యువతీ యువకులకు రూ.1530వేల వరకు వేతనం అందుతుందని తెలిపారు. ఎంవిఎస్ ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్ డా. జి.ఆర్ సూర్యనారాయణ, అకాడమిక్ కో ఆర్డికేటర్ డా. రసందర్, టి.ఎస్.కె.సి మెంటాల్‌తేజస్విని, అధ్యాపకులు పాల్గొని అభినందించారు.

## మూడో రోజు నల్లమల అడవుల్లో పులుల గణన విజయవంతం

**లింగాల, జనవరి22 ప్రభాతవార్త:** నల్లమల అడవుల్లో లింగాలరేంజ్ పరిధిలో ఎఫ్ డిఇ చంద్రశేఖర్, ఎఫ్‌ఆర్‌ఓ ఈశ్వర్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్ కార్యక్రమంలో భాగంగా పద్మనపల్లి బీట్ ఏరియాలో అడవీ ప్రాంతంలో 2 కిలోమీటర్ల మేర ట్రాన్సెక్ట్ లైన్ సర్వే నిర్వహించారు.ఈ సర్వేలోఎక్కువగా చుకలతోపులు,మనుబోతులు,కొండముచ్చులు,నీలి గాయాలు,అడవీ పందులు,కొండ గొర్రెలు,అడవీ కోళ్ళు తదితర వన్య ప్రాణులు కనిపించినట్లుతెలిపారు.మర్లపాయ,లింగాల,ధారారం బీట్‌ఏరియాలో డిఆర్‌ఓ జయదేవ్,ఎఫ్‌బిఓ ఆధ్వర్యంలో శాఖాహార జంతువులు గణన చేశారు.



మూడో రోజు నిర్వహించిన పులుల, వన్యప్రాణుల సర్వేలో డిఆర్‌ఓ, ఎఫ్‌బిఓలు

# మున్సిపల్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహిస్తాం

◆ గద్వాల జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్



వీసీలో మాట్లాడుతున్న ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని, వీడియో కాన్ఫరెన్స్ తిలకిస్తున్న కలెక్టర్, తదితర అధికారులు

**గద్వాల జనవరి22, ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికలను ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా పకడ్బందీగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ తెలిపారు. గురువారం మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై హైదరాబాదు నుంచి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలోని కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్లో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది అనుభవజ్ఞులై ఉండాలని వారికి అవసరమైన శిక్షణను సకాలంలో పూర్తి చేయాలన్నారు. పోలింగ్ స్టేషన్లలో ఓటర్లకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, కొన్ని హరిత పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల లోపలనే కాక బయట కూడా వెబ్ కాస్టింగ్ నిర్వహించడంపై ఆలోచించాలని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు గుర్తులు కేటాయించిన వెంటనే బ్యాలెట్ పేపర్స్ ను తప్పులు లేకుండా ప్రింటింగ్ చేయించాలన్నారు. కౌంటింగ్ త్వరగా పూర్తి చేసేందుకు అవసరమైనన్ని ఎక్కువ టేబుల్స్ ఏర్పాటు చేసుకోవచ్చ న్నారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సమర్థ వంతంగా నిర్వహించేందుకు ఆయా జిల్లాల ఎన్నికల యంత్రాంగం పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పలువురు ఎన్నికల అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లాలోని నాలుగు పురపాలికల్లో మొత్తం 77 వార్డులలో 189 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి అక్కడ వెబ్ కాస్టింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్, ప్రిసైడింగ్ అధికారులు, ఇతర సిబ్బందికి అవసరమైన శిక్షణ పూర్తి చేస్తామన్నారు. పోలింగ్ సందర్భంగా 430 మంది ప్రిసైడింగ్, 846 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులతో పాటు 1964 మంది ఓపిఓలు విధులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నామినేషన్, ఎన్నికల సామాగ్రి పంపిణీ, రిసెప్షన్ కేంద్రాలతో పాటు కౌంటింగ్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లన్నీ చేయనున్నట్లు పేర్కొన్నారు. బ్యాలెట్ బాక్సుల కొరత లేకుండా అదనంగా బాక్సులను అందుబాటులో ఉంచుతామని చెప్పారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవసరమైన పోలీస్ బందోబస్తును నియమించనున్నట్లు కలెక్టర్‌పేర్కొన్నారు.సమావేశంలో అదనపుకలెక్టర్ నర్సింగరావు, జెడ్పి డిప్యూటీ సీఈవో నాగేంద్రం,మున్సిపల్ కమిషనర్లు,ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాలు మారుతున్న అభివృద్ధిలో నిర్లక్ష్యం

మెదటి పేజీ తరువాయి భాగం..

జిల్లా అలంపూర్ మున్సిపాలిటీ పేరు గొప్పఊరు దిబ్బఅన్నట్లుగా మారింది. అలంపూర్ నియోజకవర్గ కేంద్రం కనుక కొన్ని హక్కులు నియమాలు ఉంటాయి. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు ఏర్పాటు తప్పనిసరి ఉండాలి. కానీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, గురుకుల పాఠశాలలు, సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయం,100 పడకల ఆసుపత్రి ,డివిజనల్ కార్యాలయాలు ఇలాంటివి పక్క మండలాల కు తరలిపోయాయి అని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి వీటి గురించి ప్రజలు చర్చించుకుంటారు.అలంపూర్ పట్టణంలో చారిత్రక నేపథ్యమున్న ఆధ్యాత్మిక ఆలయాలు విరాజిల్లు తున్నాయి. శ్రీ జోగులాంబ దేవి దేశంలో 18వ శక్తి పీఠం.రాష్ట్రంలో ఏకైక శక్తి పీఠం.అమ్మవారి దీవెనల కోసం అందరూ వస్తారు.అభివృద్ధి అడిగితే చూద్దాం చేద్దాం అన్నట్లుగా వ్యవహరిస్తారు. అలంపూర్ పట్టణంలో మౌలిక వసతుల లోపాలు స్పష్టంగా కనిపిస్తాయి. అంతర్గత డ్రైనేజీ వ్యవస్థ వైఫల్యం వల్ల ఆయా కాలనీలలో రోడ్లపైనే మురుగునీరు దర్శనమిస్తుంది.వీధిలైట్ల కోసం ఎదురుచూపులు. నూతనంగా నిర్మించుకున్న ఇళ్లకు ఇంటి నెంబర్ ఇవ్వరు.కానీ ఊరు పెరగాలి, అభివృద్ధి జరగాలంటారు. బిఆర్ఎస్ హయాంలో నిధులు కేటాయించారు. పనులు చేపట్టారు.చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో చేపట్టిన అభివృద్ధి పనులు మధ్యలోనే ఆగిపోయాయి.కాంగ్రెస్ ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిధుల కేటాయింపు జరిగిందని చెబుతున్నా అవి కాగితాల వరకే పరిమితమయ్యాయి. కాలనీలలో పారిశుద్యం, కాలుష్యం, అధ్వానంగా అంతర్గత రోడ్లు,వీధిదీపాలు,తాగునీటి సమస్యలు పట్టణ ప్రజలను వేధిస్తున్నాయి. అలంపూర్ పట్టణంలో ఆదాయ వనరులు లేకపోయినా మున్సిపాలిటీ చేశారు.మున్సిపాలిటీ అయిన తర్వాత ఆదాయ వనరుల కోసం పాలకమండలి కృషి చేయలేదు. మున్సిపాలిటీలో నిధులు లేకపోవ డంతో డబ్బులేలేవు ఏమిపనులు చేయాలి అంటూ కమిషనర్లు వస్తున్నారు, పోతున్నారు.పట్టణ స్థానిక సంస్థలకు కావాల్సి న నిధులు, అధికారాలు, స్వయం పాలన వంటి అంశాలపై పాలకులు దృష్టి సారించాలి. ప్రధాన పార్టీలు స్థానిక సంస్థలను తమ జేబు సంస్థలుగా మార్చేశాయి. రాజ్యాంగంలోని 74వ సవరణ కాగితాల్లో కాకుండా నేల మీద అమలు కావాలి.నిధులు లేని స్థానిక సంస్థలు,అధికారాలు లేని ప్రజాప్రతినిధులు ప్రజాస్వామ్యానికి అవమానం తప్పఅభివృద్ధి కాదు.ఆదాయ వనరులు సమకూరే వరకు ప్రస్తుత ప్రభుత్వం అయినాఐదు సంవత్సరాల వరకు ప్రతి ఏటా కోటి రూపాయలు ప్రత్యేక నిధులనుమున్సిపాలిటీకి కేటాయించాలి. పాలకమండలి సభ్యులు అభివృద్ధి విషయంలో ప్రత్యేక అవగాహనను పెంపొందించుకోవాలి. ప్రజలు ఎదు ర్కొంటున్న సమస్యలను,అభివృద్ధి వంటిఅంశాలను రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలి.వినతి పత్రాలు అందజే యాలి. వెంట పడిఅనుకున్నపనులు సాధించుకునే తత్వాన్ని అలవర్చుకోవాలి. భవిష్యత్తు తరాలకు అభివృద్ధి ఫలాలు అందించాల్సి న బాధ్యత అందరిపై ఉంది. రాబోయే పాలకమండలి అయినా అభివృద్ధిపై దృష్టి సారిస్తారని ఆశిద్దాం.

**అభివృద్ధి చేసే నాయకులను ఎన్నుకోండి : వివేకానంద యూత్ అధ్యక్షులు సంజీవనాయుడు...** ఆలంపూర్ నియోజకవర్గంగా ఉన్న అలంపూర్ మున్సిపాలిటీలో అభివృద్ధికి నోచుకోవడం లేదు.పాలించిన నాయకులు ఇప్పటి వరకుఎలాంటి అభివృద్ధినోచుకోలేదు. శక్తిపీఠంగా విరాజిల్లుతున్న జోగులాంబ అమ్మవారు అన్న ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాల్సి న బాధ్యత ఎంతైనా ఉన్నది. గత కొన్ని సంవత్సరాలుగా ఆలంపూర్ అభివృద్ధి చేయాల్సి న నాయకులు చేయలేదు కావున ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం అభివృద్ధికి సహకరించాలని కోరుతున్నాం.

# అక్షరమే ఆయుధం

**ప్రతి ఇల్లు ఒక గ్రంథాలయం కావాలి**
**డిజిటల్ లైబ్రరీ ప్రారంభించిన మంత్రి జూపల్లి కృష్ణారావు**





డిజిటల్ గ్రంథాలయం ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి, కలెక్టర్ బాధావత్ సంతోష్

**కొల్లాపూర్, జనవరి 22 ప్రభాతవార్త:** గ్రంథాలయాలు జ్ఞానానికి నిలయాలే కాకుండా సమాజాన్ని సంస్కరించే ఆధునిక దేవాలయాలని పర్యాటక,సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పుస్తక పఠనాసక్తి కలిగిన వ్యక్తుల ఆలోచన విధానం, గుణగణాలు సమాజహితంగా ఉంటాయని పేర్కొన్నారు. సమాజంలోని రుగ్మతలను నిర్మూలించే శక్తి పుస్తకాలకే ఉందని, ప్రతి ఇల్లు ఒక చిన్న గ్రంథాలయంగా మారాలన్నదే తన ఆకాంక్ష అని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం కొల్లాపూర్ పట్టణంలో సిఎస్ఆర్ నిధులతో ఆధునీకరించిన డిజిటల్ గ్రంథాలయాన్ని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్‌తో కలిసి గురువారం మంత్రి జూపల్లి ప్రారంభించారు. అధునాతన కంప్యూటర్లు, విస్తృత గ్రంథ సంపద, దినపత్రికలు ఈ గ్రంథాలయంలో అందు బాటులోకి తెచ్చారు.ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ దినపత్రికలు చదవడాన్ని ప్రతి ఒక్కరూ తమ దినచర్యలో భాగంగా మార్చుకోవాలనీ, విద్యార్థులు, యువత గ్రంథాలయాలను జ్ఞానార్జన కేంద్రాలుగా ఉపయోగించుకోవాలని పోటీపరీక్షల్లో ప్రతిభ సాధించేందుకు అవసరమైన పుస్తకాలు, మ్యాగజైన్లు, దినపత్రికలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు.జిల్లా కేంద్రంలో కూడా ఈ స్థాయిలో ఆధునిక గ్రంథాలయం లేదని, కొల్లాపూర్ పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగులు, విద్యార్థులు, యువతీ యువకులు ఈ డిజిటల్ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో మరిన్ని ఆధునాతన పుస్తకాలు, మౌలిక వసతులు కల్పించి, రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు పొందేలా గ్రంథాలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ గ్రంథాలయాల వినియోగంతో వ్యక్తిగత జ్ఞానం మాత్రమే కాకుండా సామాజిక అవగాహన కూడా పెరుగుతుందని తెలిపారు.ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను నిత్యం సందర్శించి పుస్తకాలు, దినపత్రికలు చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కొల్లాపూర్ ఆర్‌డీఓ బన్సీలాల్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

## మహిళల స్వయం సమృద్ధియే లక్ష్యం!

మొదటి పేజీ తరువాయి భాగం..

దోహదపడుతున్నాయని చెప్పారు. మహిళలకు నైపుణ్య శిక్షణ, సమావేశాలు, వ్యాపార ప్రోత్సాహం కోసం ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణం త్వరలో పూర్తి కానుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల ద్వారా అందిస్తున్న వడ్డీ లేని రుణాలతో మహిళలు కిరాణా దుకాణాలు,పాడి పరిశ్రమ,పశుపోషణ, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలు, హస్తకళలు, కుటీర పరిశ్రమల్లో ముందడుగు వేస్తూ అప్పుల భారం లేకుండా ఆర్థికంగా ఎదుగుతున్నారని పేర్కొన్నారు. ఈ రుణాలు మహిళల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తున్నాయని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్, మెప్మా అధికారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, కవి యాకుబ్, రాష్ట్ర సాంస్కృతిక శాఖ సలహా మండలి సభ్యులు పల్లె నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## దాబాలలో మద్యం అమ్మితే కఠిన చర్యలు

మక్తల్ సీఐ రామ్‌లాల్

**మాగనూర్, జనవరి 22 ప్రభాతవార్త:** దాబాలలో అక్రమంగా మద్యం అమ్మిన, సిట్టింగ్‌లు నిర్వహించిన కఠిన చర్యలు తప్పవని మక్తల్ సిఐ రామ్ లాల్ అన్నారు. గురువారం నారాయణపేట జిల్లా ఎస్పీ డా. వినీత్ ఆదేశాల మేరకు మాగనూర్‌మండలంలోని దాబాలలో పోలీస్ సిబ్బందితో కలిసి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. మద్యం విక్రయించడం, సిట్టింగ్‌లు చేస్తే కఠినమైన చర్యలు తప్పవని దాబా యజమానులను హెచ్చరించారు.ప్రజలశాంతిభద్రతల పరిరక్షణకోసమే తనిఖీలు నిర్వహిస్తునట్లు దాబా యజమానులు చట్టాలను తప్పనిసరిగా పాటించా లని అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈయన వెంట మాగనూర్ ఎస్సై అశోక్ బాబు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## 6వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం

**మహబూబ్‌నగర్, జనవరి22 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ పట్టణంలోని 6వ డివిజన్‌ను సమగ్రంగా అభివృద్ధి చేయాలనే స్పష్టమైన దృక్పథంతో ముందుకు సాగుతున్న అనుపటి రామస్వామి రాజకీయ ప్రయాణం జోరుగా సాగుతున్నది. కాంగ్రెస్ పార్టీ పట్ల నిబద్ధత, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి నాయకత్వంపై విశ్వాసం, ప్రజలతో నిరంతర అనుసంధానం ఇవన్నీ ఆయనను బలం చేకూరుతున్నట్లు తెలుస్తున్నది. గత కాలంలో 6వ డివిజన్‌లో జరిగిన పలు అభివృద్ధి పనులు ఆయన రాజకీయ ఆశయాలకు బలమైన ఆధారాలుగా నిలుస్తున్నాయి. ఎమ్మెల్యే సహకారం, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ ఆధ్వర్యంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి, ఎస్సీ కాలనీలో మూడు బోర్లు ఏర్పాటు చేయడంవంటి మౌలిక సదుపాయాల పనులు జరిగాయి. చైతన్య నగర్, వినాయక నగర్, అక్షర కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణం జరగడం ద్వారా ప్రజల దైనందిన జీవన ప్రమాణాలు మెరుగయ్యాయి. అదేవిధంగా ఎస్సీ స్మశాన వాటికలో స్వయంగా తన వంతు కృషిగా మంచినీటి బోరు ఏర్పాటుచేయడంఆయన సామాజిక బాధ్యతను ప్రతిబింబిస్తుంది. ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యుడిగా వ్యవహరిస్తూ అర్హులైన పేదలకు ఇళ్ల మంజూరు చేయించడంలో కీలకపాత్ర పోషించిన అనుపటి రామస్వామి, ప్రజాపాలనలో భాగంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించడం ద్వారా ప్రభుత్వం, ఎమ్మెల్యే ఎన్నంకు మంచి పేరు తీసుకొచ్చారు. త్వరలో జరిగే కార్పొరేషన్ ఎన్నికల్లో 6వ డివిజన్‌ను ఎస్సీ జనరల్‌గానిర్ణయించడం ఆయనకుమరింత బలం చేకూర్చే అంశంగా మారింది.పార్టీ పెద్దలు,ఎమ్మెల్యే ఆశీస్సులు,ప్రజల విశ్వాసం తనకు అండగా ఉన్నాయనే నమ్మకంతో కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ లభిస్తుందని ఆయనఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయంఅనే కాంగ్రెస్ సిద్ధాంతాలను క్షేత్రస్థాయిలో అమలు చేసినఅనుభవంతో తనకు అవకాశంఇస్తే 6వడివిజన్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతానని అనుపటి రామస్వామి ప్రజలను కోరుతున్నారు.

## డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ

బాసు హనుమంతు నాయుడు

**గద్వాల జనవరి 22, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకతను కప్పి పుచ్చుకునేందుకురాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందనీ బిఆర్ యస్ పార్టీ గద్వాల నియోజక వర్గ ఇంచార్జ్ బాసు హనుమంతు నాయుడు అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు పై సిట్ దర్యాప్తుకు పిలవడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటనను విడుదల చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షకు పాల్పడుతుందని విమర్శించారు.విపక్ష నాయకులను వేధించడానికి చేస్తున్న దుర్మార్గమైన చర్య అని అన్నారు. సమయాన్ని వృథా చేయడంతో పాటు రాష్ట్రంలో నెలకొన్న ప్రభుత్వ వ్యతిరేకత నుంచి దృష్టిని మరల్చడానికి నాయకులపై కేసులు వేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే ఈ కేసులో ఎలాంటి సారాంశం లేదని సుప్రీం కోర్టు స్పష్టంగా తెలిపిందని పేర్కొన్నారు. అధికార పార్టీ నిరాశ , భయంలో కొట్టుమిట్టాడుతుందని, కేవలం రాజకీయ ప్రతీకారం తీర్చుకోవడానికి, బీఆర్ఎస్ నాయకత్వాన్ని ఇబ్బంది పెట్టడానికి చేస్తున్న కుట్ర అని ఆరోపించారు. రాజకీయ బెదిరింపులతో తెలంగాణ ప్రజలను మోసం చేయలేరని వెల్లడించారు.

# మంత్రి జూపల్లి సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి



అనారోగ్య బాధితులను పరామర్శిస్తున్న దృశ్యం

**చిన్నంబావి, జనవరి 22 ప్రభాతవార్త :** చిన్నంబావి మండల కేంద్రంలోని రత్నగిరి కాలనీలో అనారోగ్యంతో మృతి చెందిన వెంకటస్వామి మృతదేహానికి నివాళులర్పించి వారి కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పానుగంటి నరసింహ, శ్రీనివాస్‌లు అన్నారు. గురువారం రత్నగిరి కాలనీలో మృతి చెందిన వెంకటస్వామి మృతదేహానికి నివాళులర్పించి వారి కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించారు. అలాగే అస్వస్థతకు గురైన పలు కుటుంబాలను వారు పరామర్శించారు. బైక్ యాక్సిడెంట్ లో గాయపడిన కాకునూరు నర్సమ్మ ను, మరో ప్రమాదంలో గాయపడి చెయ్యి ఫ్యాక్చర్ అయిన హమాలీ బిచ్చన్న ను, ఇంకో బైక్ ప్రమాదంలో గాయపడిన కిరణ్‌ను పరామర్శించి ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు సహాయ, సహకారాలతో అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుందామని అన్నారు. గ్రామంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకై లబ్ధిదారుల ఎంపిక, అర్హులైన ప్రతి కుటుంబానికి, నూతన రేషన్ కార్డులు, ఆసరా పెన్షన్ల మంజూరు, కార్మికులకు లేబర్ కార్డుల రెన్యువల్ మరియు కొత్త వాటినీ మంజూరు చేయడానికి కృషి చేస్తామని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో పానుగంటి పార్వతమ్మ, పానుగంటి బలవెంకట్,చంద్రయ్య, బన్నెల శివమల్లయ్య,పూసపాటి కురుమూర్తి, లక్ష్మీ, శివ,కిరణ్, బిచ్చన్న నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

# వివాహం చేసే ముందు వయస్సు ధ్రువీకరించుకోవాలి




సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై రామకృష్ణ

**అలంపూర్ జనవరి 22, ప్రభాతవార్త :** అల్లంపూర్ మండల కేంద్రంలోని మహిళా సమైఖ్య భవనం నందు గురువారం జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాల్య వివాహ్ ముక్త్ భారత్ 100 రోజుల ప్రోగ్రామ్ లో భాగంగా బాల్య వివాహాల నిర్మూల పైన సర్వీస్ ప్రొవైడర్స్‌కు,పురోహితులు, ఖాజీలు పాస్టర్స్, ఫోటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్, టెంట్హౌస్ మరియు ప్రింటింగ్ ప్రెస్)అవగాహన కార్యక్రమం నిర్వహించడంజరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్ పి డి ఓ పద్మావతి హాజరై మాట్లాడుతూ,బాల్య వివాహాలు, బాలల భవిష్యత్ కు అడ్డంకులు అని తెలిపారు. కావున బాల్య వివాహాలను ఎట్టి పరిస్థితులలో ప్రోత్సహించ వద్దని అన్నారు. ముఖ్యంగా పెళ్ళిల ఏర్పాటులో ముందుగా తెలిసేదే మీకు అని, మీరు పెళ్లి ఏర్పాట్లు చేసేముందు పిల్లల వయస్సు ముందే ధ్రువీకరించుకోవాలని సూచించారు. చైల్డ్ మ్యారేజ్ ప్రొహిబిషన్ ఆక్ట్ ప్రకారం అబ్బాయికి 21 సంవత్సరాలు, అమ్మాయికి 18 సంవత్సరాలు నిండి ఉండాలని, లేని పక్షంలో అట్టి బాల్య వివాహాలను ప్రోత్సహించిన వారిగా శిక్షార్హులు అవ్వతారని హెచ్చరించారు.చైల్డ్ మ్యారేజ్ చేయడం వల్ల పిల్లల భవిష్యత్తు మనమే కాలరాసినట్టుఅవుతుందని తెలియజేయడం జరిగింది. పిల్లలందరూ కూడా బడిలో ఉండాలని పెద్దలందరికీ కూడా పనిలో ఉండాలని తెలియజేయడం జరిగింది. నేటి బాలలే రేపటి పౌరులు అనే నినాదాన్ని అందరూ కూడా అమలు చేయాలని, మరియు పిల్లలందరూ ఉన్నత చదువులు చదివి ఉన్నతస్థాయిలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షి ంచారు. తెలియజేయడం జరిగింది, బాల్య వివాహం చేస్తే, చైల్డ్ మ్యారేజ్ యాక్టు ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఒక లక్ష రూపాయలు జరిమానా రెండు సంవత్సరాలు జైలు శిక్ష ఇవి రెండు కూడా ఉంటాయని చెప్పడం జరిగింది. బాల్య వివాహానికి సహకరించిన వారి పైన కూడా ఎఫ్ ఐ ఆర్ అవుతుందని తెలియజేయడం జరిగింది. పిల్లలకు ఎలాంటి సమస్యలు ఉన్న 100,1098 కు కాల్ చేసి చెప్పండి అని తెలియజేయడం జరిగింది. అల్లంపూర్ మండల సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రామకృష్ణ మాట్లాడుతూ బాల్య వివాహ ముక్త్ భారత్ లో భాగంగా, బాల్యవివాహాలు లేని రాష్ట్రాన్ని మరియు భారతదేశాన్ని నిర్మించుకోవడం కోసం సర్వీస్ ప్రొవైడర్స్ యొక్క పాత్ర కూడా చాలా ముఖ్యమని తెలియజేయడంజరిగింది.బాల్య వివాహం చేసే కార్యక్రమాలలో సర్వీస్ ప్రొవైడర్స్ ఎవరు కూడా పాల్గొనకూడదు, ప్రోత్సహించొద్దని కోరడం జరిగింది. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లయితే 100, లేదా జిల్లా బాలల పరిరక్షణ విభాగానికి సమాచారాన్ని అందజేయాలని కోరడం జరిగింది. బాల్యవిహాలను నిర్మూలించడం కోసం ప్రభుత్వం కళ్యాణలక్ష్మి,షాదీ ముబారక్, బేటి బచావో బేటి పడావో,అనేక రకాల బాలికల అభివృద్ధి కోసం సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమములో మండల విద్యాశాఖ అధికార అశోక్ కుమార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో బాలల కోసంకొన్ని హక్కులు కొన్ని చట్టాలు ప్రత్యేకంగా రూపొందించడం జరిగిందని, పిల్లలు యొక్క హక్కులను వారు పొందే విధంగా చూడాలని కోరడం జరిగింది, ఈ కార్యక్రమంలో బాలల సంరక్షణ అధికారి జోగు రవి,పూజారులు సాయినాథ్ శర్మ, రాఘవేంద్ర, పాస్టర్స్ ఇమాన్యుయల్, దేవరాజు, ఫోటోగ్రాఫర్స్ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.